POSTAL REGD.NO.PRAKASAM/16/2024-2026
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
మార్చి 2024
వెల – ₹ 10.00

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సంపుటి: 41 సంచిక: 11



శ్రీ అలివేలు మంగమ్మ దివ్య సన్నిధానము, గుమ్మళంపాడు గ్రామంలో జరుగు
పూజ్యశ్రీ అలివేలుమంగా సమేత భరద్వాజ మహారాజ్ లీలా కళ్యాణ మహోత్సవ వేడుకలు.
మార్చి 5, 6 మరియు 7 తేదీలు - 2024

# కార్యక్రమ వివరములు

## మార్చి 5, 2024, మంగళ వారం

### ఉదయ కార్యక్రమములు

గంll 5:30 – పూజ్యశ్రీ మాస్టరుగారికి మరియు పూజ్యశ్రీ అమ్మగారికి మేలుకొలుపు సేవ,
విడిది గృహమునకు ఆహ్వానించుట.
గంll 6:00 – శ్రీ సాయిబాబా కాకడ ఆరతి.
గంll 7:30 – పూజ్యశ్రీ అమ్మగారి సమాధి అభిషేకము, ప్రత్యేక అలంకరణ.
గంll 8:30 – అల్పాహార నైవేద్య సేవ.
గంll 9:00 – ప్రసాద వితరణ.
గంll 9:30 – పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారిని వరునిగా, పూజ్యశ్రీ అమ్మగారిని వధువుగా చేయుట,
వారి పాదుకలకు పంచామృతాలతో అభిషేకము,
– వేద పారాయణ,
– వస్త్ర సమర్పణ, మంగళ హారతులు.
గంll 12:00 – మధ్యాహ్న ఆరతి.
గంll 12:30 – మహా నివేదన,
తదనంతరము ప్రసాద వితరణ.

### సాయంకాల కార్యక్రమములు

గంll 4:00 – పూజ్యశ్రీ సాయిబాబాకు, పూజ్యశ్రీ మాస్టరుగారికి, పూజ్యశ్రీ అమ్మగారికి మరియు మహాత్ములకు
కాఫీ నివేదన.
గంll 6:00 – సాయంకాల హారతి.
గంll 6:30 – పూజ్యశ్రీ భరద్వాజ మహారాజ్, పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ ల ఎదురుకోలు మహోత్సవము,
వరపూజ, లగ్నపత్రిక.
గంll 7:30 – సత్సంగము భజన.
గంll 9:00 – శేజ్ హారతి.
గంll 9:30 – ప్రసాద వితరణ.

# సాయి భక్తులు: నాడూ - నేడూ

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

ఒకప్పుడు ఒక యువకుడు ఒక సత్పురుషుని దర్శించి "స్వామీ! నన్ను శిష్యునిగా అంగీకరించి ఈ ఆశ్రమంలోకి తీసుకోండి" అని ప్రార్థించాడు. "శిష్యరికం చాలా కష్టం. నేను తెల్లవారుఝామున నాలుగింటికే నిద్రలేస్తాను. శిష్యుడు నాకంటే ముందుగా నిద్రలేచి ఆశ్రమం శుభ్రం చేయాలి. నాకు స్నానం, సంధ్య, భిక్ష, అగ్నిహోత్రము మొదలగునవి సిద్ధం చేసి ఆశ్రమం పనులు అన్నీ చూసుకోవాలి. నేను రాత్రి 10 గంటలకు విశ్రమిస్తాను. అప్పుడు నాకు కాళ్లు పిసికి నేను నిద్రించాక నిద్రించాలి. అది ఎంతో కష్టం" అన్నారు స్వామి. "అబ్బా, అంత కష్టమా! అయితే ఒక పని చేయండి" అని ఆ యువకుడు అనగానే, "ఏమిటది?" అని ఎంతో ఆసక్తిగా అడిగారు స్వామి. "నన్ను గురువును చేసుకోండి" అన్నాడా యువకుడు. ఆ స్వామి నివ్వెరబోయాడు.

అలనాటి సాయి భక్తులు పాతకాలపు మనుషులు గాబోలు ఎంతసేపటికి శిష్యులయ్యేందుకే ప్రయత్నించారు. సాక్షాత్తు విష్ణుమూర్తి చేత ఆదేశించబడి, సాయిని సేవించిన రేగే (ఇండోర్), మచ్ఛీంద్రగడంలో సాయి ఆదేశానుసారంగా తపస్సు చేసి ప్రత్యక్ష సాయి దర్శనం పొందిన బాలక్ రామ్ మాన్కర్ ఉన్నారు. అహర్నిశలు సాయి చెంత నుండి సేవించిన మహల్సాపతి, తాత్యా వంటి భక్తులు ఉన్నారు. సాయి పాదాల నుండి గంగా యమునలు తీర్థంగా పొందిన దాసగణు ఉన్నారు. వీరిలో ఎవరూ గురువులు అవ్వడానికి ప్రయత్నించలేదు. డీ. ఎం. గుణే, ఫన్సే వంటి భక్తులు వైద్యముపకరించని రోగులెందరికో కేవలం సాయి ఊదితో రోగాలు బాగా తగ్గించారు. కానీ వీరెవరూ గురువు లవ్వలేదు. అది సాయి విభూతి మహిమే కానీ తమది కాదని వారికి స్పష్టంగా తెలుసు. దాసగణు వంటి కొద్దిమందిని గురువుగా తలచేవారు ఉండేవారు. కానీ వారికి సాయి సాంప్రదాయంతో సంబంధం లేదు. కానీ ఈరోజు ఎక్కువమంది సాయిభక్తులలో ఈ వ్యాసారంభములో ఉదహరించిన వైఖరి తొంగి చూస్తోంది. క్రమంగా ఎవరికి వారే సాధ్యమైనంత త్వరలో గురువుగా తెలిసి లోకపూజలు అందుకోవాలని ఆరాటపడుతున్నారు. అంతటితో సాయి భక్తుల ముఠాలు ఏర్పడుతున్నాయి. పేరుకు మాత్రం సాయిభక్తి. అసలుకు మాత్రం తమ గురుత్వం కోసం ప్రాకులాట. ఈ కారణంగా సాక్షాత్తూ మతసామరస్యమే బోధించిన సాయి సాంప్రదాయంలో నేడు పరస్పరదూషణ, అసూయాద్వేషాలతో లుకలుక లాడుతున్న సాయి భక్తుల ముఠాలు రూపొందటం శోచనీయం.

సాయి గురువును సేవించినట్లు సేవిస్తేనే శిష్యులమని చెప్పుకోవడం సమంజసమని సద్గురు నాథుడు చెప్పాడు. శిష్యులలో ఉత్తముడే గురువనదగినవాడని గూడా వారి చరిత్ర నిరూపిస్తుంది. అటు శిష్యులుగా ఉన్నప్పుడు గాని ఇటు గురువై ఉన్నప్పుడు గాని ఆయన జీవించిన విధానం ఆదర్శప్రాయమన్న వివేకం నేడు లోపిస్తుంది.

ఇంతటికీ కారణం సమగ్రమైన సాయి చరిత్ర పారాయణ, లీలా శ్రవణం, బోధలమననం లోపించడమే. ఒకవంక సాయి చరిత్ర, మరొక వంక సాయినాథుడు మనకి చూపించిన 'గురు చరిత్ర' క్షుణ్ణంగా పారాయణ చేయాలి. సచ్ఛిష్యుడు గానివాడు గురువు కాజాలడని తెలుస్తుంది. సచ్ఛిష్యుడెవ్వడూ యిటువంటి

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:41 మార్చి - 2024 సంచిక:11


*పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన "సాయిబాబా"*

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | సాయి భక్తులు: నాడూ - నేడూ | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | పరిప్రశ్న | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 06 |
| 03. | వినూత్న ఆంగ్ల సంవత్సరం - 2014 | పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ | 07 |
| 04. | మాతృదేవి స్మృతులు | శ్రీమతి కీర్తి | 12 |
| 05. | వార్తాలాపము | శ్రీమతి అడిదం వేదవతి | 13 |
| 06. | భగవాన్ శ్రీ భరద్వాజ | శ్రీమతి శ్రీదేవి | 16 |
| 07. | శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు | శ్రీమతి శ్రీదేవి | 18 |
| 08. | బుద్ధ ధ్యాన హృదయము | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 21 |
| 09. | భరద్వాజ గురుదేవుల బ్రహ్మానుభూతి వేడుకలు | శ్రీమతి టి.పద్మావతి | 23 |
| 10. | ద్వారకామాయి అనుభవమండపము | శ్రీమతి నాగమణి | 25 |
| 11. | ఆచార్యుని అద్భుత లీలలు | శ్రీ పడాల నారాయణమూర్తి | 27 |



చిరునామా

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550

**www.saibharadwaja.org**



చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

చందా వివరములు

విడి ప్రతి : ₹ 10-00

సంవత్సర చందా : ₹100-00



సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

చౌకబారు వ్యామోహాలకు లోబడడని తెలుస్తుంది. అయితే సాయి పేరిట నేడు తామర తంపరగా పుట్టుకొస్తున్న 'గురువులు' చివరికే స్థాయికి దిగజారుతున్నారంటే, సచ్ఛిష్యుడిగా, సద్గురువుగా సాయి యొక్క నడవడిని బోధను తెలిపే విధంగా వ్రాసిన 'శ్రీ సాయి లీలామృతం' తమ భక్తులు చదవడం వీరికి కంటకంగా తయారవుతోంది. తమ పదవులకు ఏవిధంగానూ ముప్పు రానివ్వనంతటి క్లుప్తమైన 'సాయి సచ్చరిత్ర', వేమూరి వెంకటేశ్వర్లు గారు రాసిన చరిత్ర వంటివి మాత్రమే చదవాలని వీరు తమ భక్తులనాదేశిస్తారు. భారతీయులు ఉన్నత విద్యను అభ్యసిస్తే తమ పరిపాలనకు ముప్పు వస్తుందని నాటి బ్రిటీష్ పరిపాలకులు కరడుకట్టిన దౌష్ట్యంతో దాచినట్లే వుంటుంది వీరి వైఖరి. నిజమైన భక్తి ఉన్నప్పుడు సద్గురు లీలా చింతనము ఎంత చేసినా తనివి తీరదని, ఎంతజేస్తే అంత మంచిదని నాడు భాగవతం నుండి నేటి గురుచరిత్ర వరకు తెలుపుతున్నాయి. నైమిశారణ్య వాసులైన మునులు సూతుని నుండి అనంతంగా భగవంతుని లీలలు విన్నారని పురాణాలు చెబుతున్నాయి. అటువంటప్పుడు సాయి సచ్చరిత్ర వంటి చిన్న గ్రంథమే చాలనీ, మిగిలినవి చదవనవసరం లేదనీ వీరు నిర్బంధించడానికి కారణాలేమో ఆలోచించవలసివుంది. సాయి విశ్వరూపము, ఆయన బోధయనే వజ్రాన్ని చూచాక ఇలా సాయి భక్తులను తమ భక్తులుగా, శిష్యులుగా బంధించుకునే స్వార్ధ సంకుచిత తత్వాల వికృతరూపం బట్టబయలవుతుంది. దీనుల హృదయాలు సాయితో నిండిపోతే యింక వాటిలో తమకు స్థానమెక్కడా మిగలదు అని భయం. ఇటువంటి భక్తులు చేసేది అవాంఛనీయం అనడానికి ఒకటే నిదర్శనం. సాయిబాబా వలన వివిధ మతాల మధ్య కూడా సామరస్యము ఏర్పడుతుంటే ఈ కపట భక్తుల వలన మఠాలు ఏర్పడి ఒక్క శిరిడిసాయి భక్తులే ఒక్కొక్క పట్టణంలోనూ, నగరంలోనూ కూడా కలిసి మెలిసి సాయిని సేవించుకోలేకున్నారు. అటువంటప్పుడు ఏ మఠావారు సాయిచేత అంగీకరింపబడరు అనడానికి– అసహనంతో ప్రవర్తించిన హిందువులను ముస్లింలను కూడా సాయి నిరసించడమే నిరూపణ. సాయి బోధల గురించి, లీలల గురించి ఇంకా ఇంకా తెలుసుకోమని ప్రోత్సహించేదే వాంఛనీయమైన సాయి భక్తి, ప్రచారమున్నూ. అలాగాక ఏ ఒక్క గ్రంథమో చాలునని సుత్తికొట్టే ప్రచారం కేవలం ఒక విధమైన మతమౌఢ్యం మాత్రమే. ఆచార్యులలో ఏ ఒక్కరో మాత్రమే వ్రాసిన వ్యాఖ్యానమే ప్రమాణం అని పండితులు బొబ్బలు పెట్టడం వలన అంతవరకు కట్టుగా ఉన్న భారతీయ సాంప్రదాయం మూడుగా విచ్ఛిన్నమై నేటికీ ఢీకొంటున్నాయి. మహమ్మద్ ప్రవక్త చెప్పిన ధర్మం గురించి ఇలాగే చీలవలు చేసుకొని ఘోరమైన మారణహోమం జరుగుతోంది. క్రీస్తు, బుద్ధుడు చెప్పిన వాటిని కూడా మూఢులలానే భ్రష్టం చేసుకున్నారు. కాకపోతే ఒక్కటే తేడా! ఇంతకు ముందటి సాంప్రదాయాలు రెండు లేక మూడు చీలవలుగా చెబితే, సాయి సాంప్రదాయం కుక్క గొడుగుల్లాగా కోటి చీలువలు అయ్యే ప్రమాదం కనిపిస్తోంది.

విరివిగా సత్సంగాలు చేయడం, సత్సంగంలో విధిగా సాయిబాబా చరిత్ర గ్రంథాలు – శ్రీ సాయి సచ్చరిత్ర మొదలుకొని శ్రీ సాయి లీలామృతము వరకు ఎన్ని గ్రంథాలు ముద్రణ అయ్యాయో అన్నీ శ్రద్ధగా చదవటం అవసరం. శిరిడీలో సాయి భౌతికంగా జీవించిన కాలంలో ఏమి బోధించారో – అంటే శ్రీ బి. వి. నరసింహస్వామి గారు సేకరించిన వివరాలు; అంతకు ముందు సాయిని ప్రత్యక్షంగా సేవించిన ప్రధాన్, నార్కే, సాయి శరణానంద వంటివారు వ్రాసిన వాటినే ప్రమాణికంగా తీసుకోవడం అవసరం. వీటిని మాత్రమే క్రోడీకరించి కూర్చబడిన 'శ్రీ సాయి లీలామృతం' అందుకే ప్రామాణికం. ఎంత మహిమలు కలిగిన భక్తులైనా సాయి మహాసమాధి తర్వాత దివ్యమైన రీతిన మనకు తెలుపుతున్నారని ప్రకటిస్తున్న అంశాలు ప్రామాణికంగా తీసుకోకూడదు. సాయి బోధలు జాగ్రత్తగా మననం చేసి వాటికి విరుద్ధంగా ఉండే సాయిభక్తుల మాటలను త్రోసి రాజనాలి. సర్వమత సామరస్యం బోధించిన సాయి పేరిట లజ్జా రహితమైన మఠాతత్త్వము; హృదయ పూర్వకమైన భక్తిని చాటిన సాయి పేరిట అజ్ఞానులు, కీర్తి కాముకులు, స్వార్ధపరులు అయిన కపట సాయిభక్తుల ఆరాధన – నెలకొల్పచూడడం ఎంత ఘోరమైన అపచారమో ఆలోచిస్తే తెలుస్తుంది. అన్ని చెడులకు మూలమైన అజ్ఞానమనే దీర్ఘ వ్యాధికి ఏకైక ఔషధమైన సద్గురు సాయిభక్తిలో ఇలా కల్తీ చేసుకుని బ్రతకడం కంటే హీనము, తుచ్ఛము ఏముంటుంది? సమగ్రమైన సాయి చరిత్రను, బోధలను చక్కగా అధ్యయనం చేసిన భక్తులు ఈ కపట గురువులనే కర్రతుమ్మలను పెకలించి పారేయాలి. సద్భక్తులు బద్ధ కంకణులై పరిశుద్ధమైన కేవల సాయి తత్త్వాన్ని వారి లీలల పరంగా, బోధల పరంగా ప్రచారం చేయాలి. ●

# పరిప్రశ్న

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

## ప్రశ్న :- దేవతలను అనన్యంగా ఉపాసిస్తే ఉద్ధరించగల సద్గురువును చూపుతారని ఎందరి అనుభవాలో తెల్పుతున్నాయి. దైవమే కరుణించినపుడు సద్గురువు యొక్క ఆవశ్యకత ఏమిటి?

**జవాబు :-** మన పూర్వపుణ్యాన్ని, ప్రస్తుత శ్రద్ధనూ అనుసరించి లౌకికమైన కష్టాలు తీర్చడము, ధర్మం తప్పినప్పుడు మనను దండించడము దేవతల కర్తవ్యము. కారణం సృష్టి అనే క్రియ కొనసాగించడానికి ప్రకటమయిన భగవంతుని శక్తులు పరిమితంగా ప్రకటమైన తత్త్వాలే దేవతలు. ముక్తిని ప్రసాదించడానికి అవతరించిన భగవంతుని కరుణా స్వరూపాలే సద్గురువులు. తమనుపాసించినవారికి దేవతలు తెల్పేది కూడా యిదే. ●

---

## ప్రశ్న :- భగవంతుడు అంటే ఏమిటి?

**– పి. నీలవేణి, 10వ తరగతి, మైలవరం డామ్**

**జవాబు :-** సముద్రంలో అలలు, మనసులో ఆలోచనలు ఉద్భవించి, కొనసాగి లయించినట్లే – విశ్వంలోని రూపాలన్నీ దేనిలో ఉత్పన్నమై కొనసాగి లయిస్తున్నాయో అట్టి విశ్వచైతన్యమే భగవంతుడు. తలంపులన్నిటి రూపాలలోనూ మనస్సు, అన్ని అలలలోనూ నీరు వున్నట్లే ఆయన అన్ని రూపాలలోనూ వున్నాడు. కలలోని రూపాలన్నీ మన మనస్సే అయినా మనకి ఆ సంగతి తెలియక భయము, సంతోషము మొ॥న భావాలు పొందినట్టే, మనం మోహితులమవడం వలన మనకా విషయం తెలియదు. భగవంతుడు, సృష్టి పట్ల మన అజ్ఞానంగూడ అలాంటిదే. ఇంతకుమించి పరిమితమైన మనబుద్ధికి పరిమితమైన మాటలలో అనంతమైన భగవంతుని గూర్చి వివరించడం సాధ్యముగాదు, ప్రయోజనమూలేదు. సాయి చెప్పినట్లు గురువును సేవించి తెలుసుకోవలసిందే. ఈలోపల సాయిలీలల నుంచి, శ్రీ గురుచరిత్రలో బోధలనుండి భగవంతుని గురించి తెలుసుకొని, వాళ్ళు చెప్పిన నిర్దుష్టమయిన మార్గాన్ని అనుసరించడమొక్కటే మార్గం. ●

*(జనవరి 2014 సాయిబాబా మాసపత్రిక నుండి)*

# వినూత్న ఆంగ్ల సంవత్సరం - 2014

***పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ***

ఎప్పటిలాగే ఇప్పుడు గూడ నూత్న ఆంగ్ల సంవత్సరాది – 2014 రానున్నది. ఆ సంవత్సరం ప్రవేశించే ఆ రోజు అర్ధరాత్రి సమయంలో ఎన్నో వినూత్న కార్యక్రమాలతోను, వినోద కార్యక్రమాలతోనూ, ఆటపాటలతోనూ ఎంతోమంది వారి అభీష్టాలననుసరించి ఆనందంగా వేడుకలు చేసుకుంటారు. కొందరు ఆధ్యాత్మిక కార్యక్రమాలు గూడ చేసుకుంటున్నారు.

ఇది ఆంగ్లేయులకు మాత్రమే నూత్న సంవత్సరం అయినప్పటికీ మనమందరమూ గూడ ఈ పండుగను చేసుకుంటాము.

అయితే గడచిన సంవత్సరము, రాబోవు సంవత్సరము (2013, 2014) వినూత్నతను, ఒక ప్రత్యేకతను సంతరించుకున్నాయి. కారణం పూజ్యశ్రీ మాస్టరుగారి జీవితంలో జరిగిన సంఘటనలు, అంటే ఆయన జననము, ఆయనకు శిరిడీలో సాయినాథుని వద్ద కలిగిన ఆత్మానుభూతి మొ॥న ప్రత్యేక వేడుకలు ఈ సంవత్సరాలలో రావడమే.

2013, ఫిబ్రవరి 9వ తేదీ పూజ్యశ్రీ మాస్టరుగారికి ఆత్మానుభూతి కలిగి 50 సం॥లు పూర్తి అవడంతో అది ఒక స్వర్ణోత్సవంగా రూపుదిద్దుకున్నది. ఆ ఉత్సవాన్ని ఒక ప్రత్యేక రీతిన జరుపుకుని ఆయనను పూజించుకున్నాము, ఆరాధించుకున్నాము.

అలాగే అతిముఖ్యమైనదిగా, విశిష్టమైనదిగా, ప్రత్యేకమైనదిగా మనం భావించుకుని ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకోవాలనుకుని సంకల్పించి కృతజ్ఞతా మహోత్సవంగా జరుపుకోవాలని 2011 లో సంకల్పించిన ఆ శుభఘడియ అక్టోబరు 30, 2013 రానే వచ్చింది. అందుకు సాయి మాస్టర్ భక్తులందరూ ఏకమై అమితోత్సాహంతో ఆ వేడుకను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

అందుకు అనేకమంది అనేక విధాలుగా స్పందించారు. శ్రీ సద్గురు భరద్వాజ తత్త్వప్రచార సమితివారు ఈ సందర్భంగా తమ సేవగా లక్షమంది చేత శ్రీసాయిలీలామృత గ్రంథ పారాయణలు చేయించాలని సంకల్పించారు. ఆ పారాయణలు చేసేవారికి ఉచితంగా గ్రంథాలను బహూకరించడానికి ఎంతోమంది ముందుకు వచ్చారు. లక్ష పారాయణ యజ్ఞం దిగ్విజయంగా పూర్తయింది. అలాగే పదకొండు వేలమంది బాలబాలికలు 'బాలల శ్రీసాయిలీలామృతము' పారాయణలు పూర్తి చేశారు. చి॥సౌ॥ వేదవతి పూజ్యశ్రీ మాస్టరుగారికి 75 సం॥లు పూర్తయిన సందర్భంగా హైదరాబాదులో 75 సత్సంగాలు చేయడం జరిగింది. అలాగే ఎంతోమంది వారి వారికి అనుకూలమైన ప్రదేశాలలో వారి శక్తి మేరకు సత్సంగాలు నిర్వహించి పూజ్యశ్రీ మాస్టరుగారికి ఆ విధంగా సేవ చేసుకుని తమ తమ కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

పూజ్యశ్రీ మాస్టరుగారి వజ్రోత్సవ జన్మదినం దగ్గర పడుతున్న కొద్దీ భక్తులలో ఉత్సాహం పెల్లుబికింది. అనేకచోట్ల పూజ్యశ్రీ మాస్టరుగారికి, బాబాకు ఊరేగింపులు ఘనంగా చేసుకున్నారు. శిరిడీలో సాయిసన్నిధిలో కూడ పూజ్యశ్రీ మాస్టరుగారికి ఊరేగింపు జరిగింది. ఇలా జరగడం శిరిడీ చరిత్రలోనే అపూర్వం, అద్భుతం. శ్రీ శిరిడీ సాయినాథుడు తన అనుంగు బిడ్డడితో కలిసి శిరిడీ పుర వీథులలో ఊరేగింపు జరిపించుకున్నారు. ఇంతకంటే పూజ్యశ్రీ మాస్టరుగారికి జరుగవలసిన మహోత్సవ కార్యక్రమం ఏమున్నది? ఆయనపై ఆయన తండ్రియైన సాయినాథునికి వున్న అనుగ్రహానికి నిదర్శనం మరొకటి ఏమున్నది? అందుకే ఆయన సాయిప్రియ తనయుడు, సాయిపియ శిష్యుడు గూడ! "నాకు ఎవరి పొగడ్తలుగాని, తెగడ్తలుగానీ అవసరం లేదు, వాటిని పట్టించుకోను గూడ. నా తండ్రి, గురువుయైన సాయినాథుడు మెచ్చేరీతిన నేను ప్రవర్తించగలితే చాలు" అని ఆయన చెప్పినట్లు ఆయనకు ప్రపంచంలోని సద్గురువులలోకెల్ల సద్గురువు అయిన శ్రీ శిరిడీ సాయినాథుని ఆశీస్సులు, ప్రేమ పుష్కలంగా వున్నాయి. ఆయనకు మరి ఇంకేమి కావాలి?



అక్టోబరు 30, 2013 - పూజ్యశ్రీ మాస్టరుగారి జన్మదినం రానే వచ్చింది. ఇక సాయిభక్తుల, సాయి మాస్టర్ భక్తుల ఆనందానికి అవధులు  లేవు. ఆయన సుస్థిరంగా నిలచిన ఒంగోలుకు ఎంతోమంది భక్తులు చేరుకున్నారు. ఎంతో ఘనంగా ఆయనకు ప్రత్యేక పూజలు, సేవలు చేసుకున్నారు. మరెంతో వైభవంగా ఒంగోలు పురవీధులలో ఊరేగింపు చేసారు. మరెన్నో పట్టణాలలో ఆ విధంగానే భక్తులు ఆయనకు వైభవంగా జన్మదిన మహోత్సవాలు జరుపుకున్నారు.

తర్వాత ఆయన జన్మతిథియైన కార్తీక శుద్ధ సప్తమి (9-11-2013) నాడు గూడ అనేకచోట్ల పూజ్యశ్రీ మాస్టరుగారికి పూజలు, ఊరేగింపులు జరుపుకున్నారు.

ఆ రోజుకు చాలామంది భక్తులు హైదరాబాదుకు చేరుకున్నారు. ఆ రోజుకు చి॥ద్వారకనాథ్ పూజ్యశ్రీ మాస్టరుగారు దర్శించిన మహాత్ములందరిని ఆహ్వానించాలని సంకల్పించి హైదరాబాదులో జరిగే పూజ్యశ్రీ మాస్టరుగారి వజ్రోత్సవ జన్మదిన వేడుకలకు విచ్చేయవలసినదిగా వారందరికీ లిఖిత పూర్వక ఆహ్వానాలు పంపి, పట్టువస్త్రములు సమర్పించుకుని వారందరినీ ప్రార్థనా పూర్వకంగా ఆహ్వానించాడు.

ఆయా ప్రాంతాలలోని భక్తులు పూజ్యశ్రీ మాస్టరుగారు దర్శించిన మహాత్ములను దర్శించి, వారికి పట్టువస్త్రాలు, ఆహ్వాన పత్రికలు, దక్షిణ తాంబూలాలు సమర్పించుకుని పూజ్యశ్రీ మాస్టరుగారి జయంతి ఉత్సవానికి రావలసినదిగా భక్తిశ్రద్ధలతో ఆహ్వానించారు.

9-11-2013 ఉదయం ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ పూజ్యశ్రీ మాస్టరుగారి జయంతి ఉత్సవానికి విచ్చేసిన భక్తులందరితో కలిసి ఆయా మహాత్ములను ఒక్కొక్కరిగా ఆహ్వానించి, వారు వేదికమీదికి వస్తుండగా ఆ మహాత్ములకు 'వారు' (పాదాలు కడగడానికి నీరు) పోసి భజన మారుమ్రోగుతుండగా

ఒక్కొక్కరినీ వేదికమీద వారికి ఏర్పరచిన ఉచితాసనాలమీద ఆసీనులను చేశాడు. ఒక్కొక్క భక్తుడు ఆ మహాత్ములను తీసుకువస్తుంటే మిగిలిన భక్తబృందము వారిని అనుసరిస్తుండగా జరిగిన ఆ వేడుక ప్రతి ఒక్క మహాత్మునియందు అందరికీ గల భక్తిశ్రద్ధలను ఇనుమడింపజేసింది. ఆ తరువాత ఆ మహాత్ములందరికీ పానీయము సమర్పించి భక్తులందరూ లఘుపూజ చేసుకున్నారు. ఆ తరువాత వారికి యథావిధిగా అల్పాహారము, కాఫీ నివేదన సమర్పించుకున్నారు. వేదికకు ఇరుప్రక్కలా అంతమంది మహాత్ములు ఆసీనులై తమ ముద్దుబిడ్డడి జన్మదినోత్సవాన్ని తిలకిస్తుంటే వారిని, పూజ్యశ్రీ మాస్టరుగారిని చూడడానికి ఎన్ని నేత్రములైనా చాలవేమోననిపించింది ప్రతివారికి.

ఆ మహాత్ములంతా తప్పక వచ్చారన్న దానికి నిదర్శనంగా ఇక్కడ జరిగిన చిన్న అద్భుతలీలను చెప్పుకుందాము. నాగోలులో నివసించే నరహరి దంపతులు కన్నడీయులు. శ్రీ రాఘవేంద్రస్వామి భక్తులు. శ్రీమతి పద్మజ (నరహరి భార్య) చిన్నప్పటినుంచి శ్రీ రాఘవేంద్రస్వామినే దైవంగా భావిస్తూ, కొలుస్తూ వుంటుంది. వారు పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి తెలుసుకుని, తరువాత ఆయనపట్ల ఆకర్షితులై ఇక్కడ సత్సంగ సభ్యులతోపాటు నాగోలులోనే స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. ఆమెకు కలిగిన దివ్య స్వప్నం గురించి ఆమె మాటలలోనే చెప్పుకుందాము :

"ఆ రోజు నవంబరు 8వ తేదీ!



తెల్లవారితే పూజ్యశ్రీ ఆచార్య భరద్వాజ మహరాజ్ వారి జయంత్యుత్సవం. దాదాపు 4, 5 రోజుల ముందునుంచి మాస్టరుగారి జయంతి ఉత్సవాల ఏర్పాట్లలో మునిగివున్నాము. మరునాడు ఉత్సవం అనగా ఎప్పుడు తెల్లవారుతుందా, ఎంత తొందరగా ఉత్సవానికి వెళ్ళాలా అన్న ఆతృతతో నిద్రపోయాను.

సరిగ్గా తెల్లవారుఝామున నాకొక కల వచ్చింది. అందులో.... అది మంత్రాలయం రాఘవేంద్రస్వామి బృందావనం. పైగా అలంకార యుక్తంగా వుంది. ఆ బృందావనం కదిలి ఎక్కడికో వెళుతున్నట్లు దర్శనమైంది. అక్కడి జనమందరూ ఆశ్చర్యంతో, "అయ్యో! బృందావనం కదులుతద! రాయరు ఎల్లిగి హోగుతిద్దార?" అంటే "బృందావనం కదులుతోందేమిటి? రాయరు ఎక్కడికి వెడుతున్నారు?" అని ఆందోళనలో ఒకరినొకరు ప్రశ్నించుకుంటున్నారు. అందులో ఒకరు, "అప్పా ఎల్లగి హోగుతిద్దిరి?" అంటే "స్వామీ ఎక్కడికి వెడుతున్నారు?" అని అడగ్గా "నాను ఉత్సవక్క హోగుతిద్దివి, నాళై బరిని" – అంటే "నేను ఉత్సవానికి వెడుతున్నాను, రేపు వస్తాను" అని చెప్పారు... బృందావనం కదులుతూ వుంది. అంతలో నాకు మెలకువ వచ్చింది.

ఏమిటి ఈ స్వప్న దర్శనం? అని ఆలోచించాను. అపుడు ఒకటి గుర్తుకు వచ్చింది. శ్రీ ద్వారకబాబుగారు జరుగబోయే కృతజ్ఞతా మహోత్సవానికి 2011 సం॥లో శ్రీ రాయరుని ఆహ్వానించి వస్త్రసమర్పణ చేసుకునే సేవా భాగ్యాన్ని మాకు కల్పించారు. మా దంపతులిరువురం ఆ సేవ చేసుకుని వచ్చాము. ఇది జరిగి చాలా రోజులు అయిన కారణంగా నాకు జ్ఞాపకం కూడా లేదు. శ్రీ మాస్టరుగారి

జయంతి ఉత్సవాలకి మహాత్ములను, అవధూతలను ఆహ్వానిస్తున్నారని తెలిసింది. ఆ మహాత్ముల చిత్రపటాలలో రాఘవేంద్రస్వామి ఉన్నారా? లేదా? లేకపోతే ఎలా? పోనీ, ద్వారక బాబుగారికి ఈ కల చెప్పి గుర్తుచేద్దామా అంటే, ఇంకా కొన్ని గంటలలో ఉత్సవం ప్రారంభమవుతోంది. 'మరి ఇప్పుడు గుర్తుచేస్తే ఎలా? అయినా వారికి గుర్తు చేసేటటువంటి దాన్నా?' అనుకుంటూ రాయరుకే నమస్కరించుకుని, "నా కల నిజమే అయితే అక్కడ అందరి మహాత్ములతో పాటు మీరూ వుంటారు, లేదా నా కల భ్రమ అనుకుంటాను" అనుకుని ఉత్సవానికి వెళ్ళి 'శ్రీ భగవాన్ భరద్వాజ' గ్రంథం పారాయణ చేసుకుంటున్నాను. ఇంతలో మహాత్ములను ఆహ్వానించే కార్యక్రమం మొదలైంది. నేను కూడా మహాత్ములను ఆహ్వానించే స్థలంలో నిల్చుని ఆ మహాత్ములలో శ్రీ రాఘవేంద్రస్వామి పటం కోసం ఎదురుచూస్తూ ఉత్కంఠతతో గమనిస్తున్నాను. దాదాపు చాలామంది మహాత్ముల ఆవాహన అయిపోయింది. తర్వాత స్వామి దర్శనం అయింది. నా ఆనందానికి అవధులు లేవు. ఆనంద భాష్పాలతో శ్రీ రాఘవేంద్ర స్వామికి నమస్కరించుకున్నాను. అప్పుడే నా కల భ్రమకాదు నిజమే అని నిర్ధారించుకున్నాను."

ఆ రోజు జన్మదిన వేడుకలకు నిర్మించిన వేదిక అత్యద్భుతము. ఆ వేదిక దివ్యశోభలతో విరాజిల్లింది. అనేక రంగుల విద్యుద్దీపాలతో వివిధ రకాల పుష్పాలతో వేదిక మాత్రమే గాక మండపం మొత్తం అలంకరింపబడింది. ఆ రోజు ఉదయం వేదికమీద పూజ్యశ్రీ మాస్టరుగారి నిలువెత్తు చిత్రపటం ఎత్తైన ఆసనంపై ప్రతిష్ఠింపబడినది. ఉదయం నుంచి భజనలతోనూ, పూజ్యశ్రీ మాస్టరుగారిమీద గీతాలాపనలతోనూ కార్యక్రమం కొనసాగింది. మధ్య మధ్య ద్వారకనాథ్ పూజ్యశ్రీ మాస్టరుగారి జీవితంలో జరిగిన సంఘటనలను వివరించాడు.

సాయంత్రం తిరిగి వేదికను మరింత శోభాయమానంగా తీర్చిదిద్దారు. పూజ్యశ్రీ మాస్టరుగారి నిలువెత్తు చిత్రపటాలను ఐదింటిని వేదికమీద పొందికగా అమర్చారు. వేదిక అలంకరణలో ద్వారకనాథ్ నాగోలు సత్సంగ బృందంలోని యువకులు ప్రధానపాత్ర వహించారు. వారు చేసిన అద్భుత అలంకరణకు అందరూ అచ్చెరువొందారు. ఆ అలంకరణలో వారికి ఎంతోమంది భక్తులు సహకరించి పూజ్యశ్రీ మాస్టరుగారికి ఆ విధంగా సేవ చేసుకునే భాగ్యాన్ని పొందగలిగారు. అంతేగాక పూజ్యశ్రీ మాస్టరుగారి వివిధ చిత్రపటాలు ఉత్సవ మంటపానికి వచ్చేదారి పొడవునా అందంగా - ప్రతిష్ఠింపజేశారు. అందువలన మంటపానికి వస్తున్న ప్రతివారికి పూజ్యశ్రీ మాస్టరుగారితో కలిసి నడుస్తూ వున్న అనుభూతి కలగడం ఒక ప్రత్యేకత.

పూజ్యశ్రీ మాస్టరుగారు నిలువెత్తు చిత్రపటాల రూపాలలో వేదికనలకంరించి వుండగా చూచినవారికి అవి చిత్రపటాలుగా గాక సాక్షాత్తూ ఆయనక్కడ ఆశీనులై తమ కరుణాదృక్కులతో తామందరినీ తిలకిస్తున్నారా! అనిపించింది. కొందరికి ఆనంద భాష్పాలు పెల్లుబికాయి. మరికొందరికి భక్తి పారవశ్యంలో భావోద్రేకం కలిగింది. కొందరు ఆనందంతో కళ్ళు మూసుకుంటే మరికొందరు కన్నార్పక చూస్తూ కూర్చున్నారు. నిజానికి ఆ రోజు ఆయన అక్కడ కూర్చుని వున్నారనడంలో సందేహం లేదు. ఆయన ఎవరెవరికి ఎటువంటి దివ్యానుభవాలు ప్రసాదించారో ఎవరికెరుక?

సాయంత్రం కార్యక్రమం స్వాగత గీతాలాపనతో ప్రారంభమైంది. తర్వాత పూజ్యశ్రీ మాస్టరుగారి జీవిత విశేషాలను ద్వారకనాథ్ వివరిస్తుండగా మధ్య మధ్యలో ఆయన జీవిత ఘట్టాలను గూర్చిన గీతాలను నాగోలు సత్సంగ సభ్యులు కొందరు శ్రావ్యంగా గానం చేసారు. పూజ్యశ్రీ మాస్టరుగారి బాల్యలీలలను గూర్చిన గానం చేస్తుంటే శ్రీ భరద్వాజ గురుకులం పిల్లలు చక్కటి అభినయంతో నృత్యం చేసారు. వచ్చిన భక్తులందరూ పూజ్యశ్రీ మాస్టరుగారి జీవిత విశేషాలను వింటూ ఆయన స్మరణలో తన్మయులయ్యారు.

ఈ మహోత్సవాన్ని తిలకించిన ప్రతి ఒక్కరూ పులకించి పోయారు. ఇక్కడ ఎన్నో ఉత్సవాలు ఇంతకుముందు కూడా జరిగాయి. ఇంతకంటే వైభవంగా గూడా జరిగివుండవచ్చు. కానీ ఈ ఉత్సవంలో అంతమంది మహాత్ముల యొక్క, పూజ్యశ్రీ మాస్టరుగారి యొక్క ప్రత్యక్ష సాన్నిధ్యం అందరికీ అనుభవమైంది. ఆ అనుభవంతో అందరూ దివ్యానుభూతిలో మునిగిపోయారు. వారి ఇళ్ళకు వెళ్ళిన తర్వాత కూడా మాస్టరుగారి ప్రత్యక్ష సాన్నిధ్యం తమ వెంటనంటే వున్నదని, ఆ అనుభూతి నెన్నటికీ మరచిపోలేమని, అటువంటి ఉత్సవం చూసినందుకు ధన్యులమయ్యామని ఫోన్ల ద్వారా

కూడా తెలియజేశారు. నిజంగా అది ఒక ఆధ్యాత్మిక దివ్యానుభూతి! పూజ్యశ్రీ మాస్టరుగారి ప్రత్యక్షానుభూతి! మరువరాని, మరపురాని ఆయన యొక్క అనంత ప్రేమానుభూతి!!

ఇంతకూ ఎంతోమంది మహాత్ములుండగా ఆయనకు మనం ఇంతగా కృతజ్ఞతలు చెప్పుకోవలసిన అవసరమేమిటి?

మహాత్ములందరూ జీవులనుద్ధరించడానికే అవతరిస్తారు. వారి తత్త్వాన్ని బట్టి, వారి సంకల్పాన్ని బట్టి వారివారి చర్యలుంటాయి. వారు చేసిన సాధనామార్గాలననుసరించి వారి ఆధ్యాత్మ బోధ వుంటుంది. ఉదాహరణకు రమణమహర్షి 'నేను' అనేదేమిటో గమనించమని చెబుతారు. అదే రామకృష్ణ పరమహంస భక్తి మార్గాన్ని ప్రవచిస్తారు. వారి వారి బోధనలననుసరించి కొందరు ఆ సాధనలు చేసి ఆధ్యాత్మిక మార్గంలో పయనిస్తారు. సామాన్య మానవులకు కూడా వారి కోరికలు కొంతవరకూ తీరవచ్చుగాని, అందరూ ఆయా మార్గాలలో పయనించలేరు. కారణం వారు తమ లౌకిక జీవితాలను త్యాగం చేయలేరు గనుక. అందుకని ఆధ్యాత్మికత అంటే వేరే ప్రపంచమని, పూర్తి వైరాగ్యంతో వుండగలవారికి మాత్రమే అది సాధ్యమని తలచి సామాన్య ప్రజలు కొందరు ఆధ్యాత్మిక మార్గంలోకి వెళ్ళడానికి ఇష్టపడరు. మరి వారి పరిస్థితేమిటి? వారు ఈ లౌకిక జీవితంలో, దానిలో వుండే కష్టసుఖాలలో కొట్టుకు పోవలసినదేనా? మరి అందరూ సన్మార్గవర్తనులై ఆధ్యాత్మిక మార్గంలో పయనించేదెలా?

దీనికి పరిష్కారమార్గంగానే పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారు అవతరించారు. సంసారులు కూడా ఎలా ఉన్నత ఆధ్యాత్మిక జీవనం కొనసాగించవచ్చో ఆయన ఆచరించి తెలియజేశారు.

ఆయన తమ వద్దకు వచ్చిన ఆర్తుల బాధలు తీర్చారు. అర్థార్థుల కోరికలు నెరవేర్చారు. జిజ్ఞాసువుల సంశయాలకు సమాధానాలు చెప్పారు. మోక్షాపేక్షతో వచ్చినవారికి ముక్తి మార్గానికి కావలసిన ఎన్నో సాధనా మార్గాలను తెలియజేశారు. ముఖ్యంగా మనమందరమూ సుఖశాంతులతో విరాజిల్లడానికి గురు సాంప్రదాయాన్ని లోకానికి తెలియబరచారు. సమర్థ సద్గురుడైన శ్రీ శిరిడీ సాయినాథుడిని మనకు పరిచయం చేసి మన జీవితాలకు శాంతిని చేకూర్చారు. శ్రీ సాయి మాస్టర్ భక్తులందరికీ శ్రీ సాయిబాబా వలన, అందుకు కారణభూతులైన శ్రీ సాయి మాస్టర్ వలన తమకు కలిగిన శ్రేయస్సు తెలుసు. అందుకు ప్రతిఫలంగానే ఆయనకు కృతజ్ఞతలను తెలుపుకోవడం జరుగుతున్నది. ఎంతోమంది తమ శాయశక్తులా అనేక విధాలుగా ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకున్నారు. తమ శక్తి మేరకు ఎన్నో సేవలు చేసుకున్నారు. ఆయన 75వ జన్మదిన సందర్భంగా వజ్రోత్సవ వేడుకలను కృతజతాపూర్వకంగా వైభవంగా జరుపుకున్నారు.

అయితే ఈ మహోత్సవం ఇంతటితో పూర్తి కాలేదు. ఏప్రిల్ 2104లో జరిగే పూజ్యశ్రీ మాస్టరుగారి ఆరాధనోత్సవంతో పూర్తవుతుంది. ఆ ఉత్సవాన్ని కూడా మనం ఎంతో శ్రద్ధాభక్తులతో జరుపుకుందాము. ఇప్పటినుంచే మనకు అవకాశమున్నంత మేరకు, శక్తిమేరకు దీక్షలు, పారాయణలు నిర్ణయించుకుని ఆరోజున ఆయనను ఆరాధించడానికి సంసిద్ధులమౌదాము.

అంతేకాదు, అంతమాత్రమే చాలదు. ఆయన మనకు, మన కుటుంబాలకు, ప్రపంచానికి చేస్తున్న శ్రేయస్సుకు జీవితాంతమూ ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకోవలసిందే!

ఏ మహాత్ముడికైనా కేవలం వైభవంగా ఉత్సవాలు జరుపుకోవడం మాత్రమే ప్రీతికరం కాదు. వారు చెప్పినట్లు నడుచుకోగలగడం వారికి అత్యంత ప్రీతికరమైన విషయం. పూజ్యశ్రీ మాస్టరుగారికి కూడా అంతే. ఏ తండ్రికైనా కొడుకు తనను కీర్తించడం మాత్రమే చాలక ఒక ఉత్తమమైన వ్యక్తిగా జీవించడం ఎలా ఇష్టమో పూజ్యశ్రీ మాస్టరుగారికి కూడా మన ప్రవర్తన సరిగా వుండడం, ఇతరులకు శ్రేయస్సు చేకూర్చే విధంగా వుండడం అత్యంత ప్రీతికరము. అట్లాగని బిడ్డలమైన మనము చేసే వేడుకలు ఇష్టం కాదని కాదు. ఆయన కోరిన విధంగా మన ప్రవర్తన మలచుకున్నప్పుడు మాత్రమే ఇవి కూడా ఇష్టము.

ఈ విషయాన్ని మనం నిరంతరమూ గుర్తుంచుకుని ఆయనకు నచ్చిన విధంగా, ఆయన మెచ్చే విధంగా నడుచుకోవడానికి ప్రయత్నిద్దాము. ఆ విధమైన సాధన చేస్తూ జీవితాంతమూ ఆయనకు వేడుకలు జరుపుకుందాము.

ఈ నూతన సంవత్సర సందర్భంగా ఈ దీక్షను పూని ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకుందాము.●

# మాతృదేవి స్మృతులు

**శ్రీమతి కీర్తి, పామూరు**

తమ సమాధి అనంతరం కూడా భక్తులను అనుగ్రహిస్తున్న పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లి లీలావైభవాన్ని పామూరు వాస్తవ్యురాలు శ్రీమతి కీర్తిగారు ఈవిధంగా తెలియచేస్తున్నారు.

2020 వ సంవత్సరంలో పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారి తిథిప్రకారం జయంతినాడు పూజ్యశ్రీ మాస్టరుగారు, పూజ్యశ్రీ అమ్మగార్ల అనుగ్రహంవల్ల నాకు వివాహం జరిగింది. ఒక సందర్భంలో పెళ్లి ఆగిపోయే పరిస్థితులు వచ్చాయి. ఆ రోజు నేను బాగా ఏడుస్తుంటే రాత్రి స్వప్నంలో పూజ్యశ్రీ మాస్టరుగారు, పూజ్యశ్రీ అమ్మగారు దర్శనమిచ్చి, "ఎందుకు ఏడుస్తావు? ఈ పెళ్లి మేము జరిపిస్తాము కదా!" అన్నారు. అలాగే మరునాడు పరిస్థితులు మారి వివాహం జరిగింది.

2021 జూన్ 5 వ తేదీన నా గర్భంలో వున్న 6 నెలల పాప చనిపోయింది. నేను చాలా బాధపడ్డాను. బాగా ఏడ్చేదాన్ని. అటువంటి పరిస్థితిలో ఒకరోజున పూజ్యశ్రీ అమ్మగారు నాకు స్వప్నంలో దర్శనమిచ్చి నా ఒడిలో బియ్యం, పళ్ళు వేసి, "నాకు చీర పెట్టు! ఈసారి ఏమీ కాకుండా నేను చూసుకుంటాను" అని చెప్పారు. అలాగే పూజ్యశ్రీ అమ్మగారికి చీర, పసుపు, కుంకుమ, గాజులు తీసుకువచ్చి సమర్పించడానికి నేను మావారితో కలిసి మొట్టమొదటిసారిగా 2022 ఫిబ్రవరిలో గుమ్మళంపాడులో కొలువైవున్న పూజ్యశ్రీ అమ్మగారి దివ్యసన్నిధికి వచ్చాను. వస్తూనే, సమాధి మందిరంలో పూజ్యశ్రీ అమ్మగారి పటంలోని వారి బొట్టునుంచి కాంతి కిరణాలు వెలుగుల్ని విరజిమ్మాయి! నేను ఆశ్చర్యంగా చూశాను. పూజ్యశ్రీ అమ్మగారి సమాధికి నమస్కారం చేసుకుంటుంటే చాలా చల్లగా వున్నట్లు అనుభూతి కలిగింది. అందులోనుంచి చాలా వింతైన సువాసనలు వచ్చాయి!

అప్పుడు నేను, "అమ్మగారూ! మీరు అడిగి నాచేత ఈ చీర పెట్టించుకున్నారు కదా! దానికి నాకు ఏదైనా నిదర్శనం యివ్వండి" అని మనసులో ప్రార్థించుకున్నాను. కొంతసేపటికి పూజ్య గురుదంపతుల ప్రియపుత్రిక శ్రీమతి వేదమ్మగారు వచ్చారు. నేను తెచ్చిన చీర, పసుపు, కుంకుమ వారికి సమర్పించుకున్నాను. నాకు స్వయంగా పూజ్యశ్రీ అమ్మగారికే సమర్పించుకున్నంత తృప్తి కలిగింది. అలా నాకు నిదర్శనం చూపించారు. తిరిగి అదేరోజు పామూరు వచ్చేశాను.

మర్నాడే మళ్ళీ పూజ్యశ్రీ అమ్మగారు స్వప్న దర్శనమిచ్చారు. అందులో పూజ్యశ్రీ అమ్మగారు సమాధి మీద దుప్పటి కప్పుకుని పడుకున్నారు. నేను, మావారు పక్కన నిల్చుని వున్నాము. పూజ్యశ్రీ అమ్మగారు నా పొట్ట మీద చెయ్యిపెట్టి, 'సంతానాన్ని యిస్తున్నాను నీకేమీ కాదు, భయపడకు' అని చెప్పారు. తరువాత మమ్మల్నిద్దర్నీ కాళ్ళు పట్టమన్నారు. మేమిద్దరము పూజ్యశ్రీ అమ్మగారిని కూర్చోపెట్టి పాదాలు వత్తాము. అదీ స్వప్నం!

పామూరులో కొంతమందిమి ఒకచోట చేరి సత్సంగాలు చేసుకుంటూవుంటాము. విడిగా ఎవరి ఇంట్లో వాళ్ళం సత్సంగం చేసుకుంటాము. అలా నేను 9 వారాలు సత్సంగం చేసుకుందామనుకుని 5 వారాలు చేసుకుని ఆపేశాను. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు స్వప్నదర్శనమిచ్చి, "సత్సంగం చేసుకోవడం ఎందుకు ఆపేశావు? అన్నీ మర్చిపోతావేం?"

*మిగతా 24వ పేజీలో*

# వార్తాలాపము

(గత సంచిక తరువాయి)

**శ్రీమతి అడిదం వేదవతి**

**శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.**

## 12వ ప్రసంగము

ఇది తెలుసుకొని దత్తాత్రేయులు ఇలా తలచారు:

పింగళ ధనం కోసం విటుడికై ఎదురుచూస్తూ నిద్ర సుఖాన్ని కోల్పోయింది. అలాగే నేను కూడా ధనం కోసం ధనవంతుల మనస్సులను రంజింపజేయాలని (ఆనందపరచాలని) భావిస్తే బ్రహ్మసుఖమును ప్రసాదించే సాధనలను చేయలేను. ఇలా ఆయన వేశ్య నుంచి బోధను గ్రహించారు. దీని సారాంశమేమిటంటే - రకరకాల పదార్థాల పట్ల ఆశ కలిగి యోగాన్ని ఆచరించినట్లయితే మానవుడికి ఎప్పటికీ సిద్ధి కలుగదు. ఈ దృష్టాంతం సన్యాసికి కూడా సరిపోతుంది. మంద వైరాగ్యము కలవాడు పైకి ప్రపంచాన్ని త్యజించినట్లు కనిపించినా, ఏకాంతంలో చిత్తమును ఏకాగ్రం చేయడానికి ప్రయత్నించినా అంతరంగంలో ఆశ వుండడం చేత 'నా దగ్గరకు సేఠులు, షావుకార్లు, రాజులు, మహారాజులు రావాలి. నన్ను పూజించి నా చుట్టూ వుండాలి' - అనే కోరిక కలుగుతుంది. అప్పుడు సంసారులైన ప్రజలు అర్పించే కానుకల ద్వారా ఆశలనబడే వందలకొద్దీ పాశాలయందు చిక్కుకుంటారు. కొంతమంది ధనవంతులైన గృహస్థులు కూడా ఏకాంతంలో యోగసాధన చేస్తారు. వారు ధనవంతులు కావడం చేత వారికి కానుకలు కావాలని, ఇతరులు తనను పూజించాలనీ కోరిక వుండదు. కానీ భార్యాబిడ్డల పట్ల ప్రేమ అనే స్వభావసిద్ధమైన ఆశ వుంటుంది. ఆ ఆశ కూడా మోక్షమార్గంలో విఘ్నం కలుగజేసేదే!

ఈ విషయంలో శంకరాచార్యుల వారి వాక్యాలు వినండి -

***శ్లో॥ యేషామాశా నిరాశా***
***స్యాద్దారపుత్రధనాదిషు ।***
***తేషాం సిధ్యతి నాన్యేషాం***
***మోక్షాశాభిముఖీ గతిః ॥***

భావం: భార్యాబిడ్డలు, ధనము మొ॥న వాటి యందలి ఆశ ఎవడిలో నిరాశగా మారుతుందో- అంటే భార్య, బిడ్డలు, ధనము మొ॥న వాటి పట్ల ఆశ అంతరంగము నుండి వెళ్లిపోతుందో – అతడే మోక్షమార్గంలో సాఫల్యం పొందుతాడు. ఇతరులు పొందలేరు.

అపరిగ్రహము: పరిగ్రహము విడిచిపెట్టి యోగాన్ని ఆచరించడమే 'అపరిగ్రహము'. పరిగ్రహమంటే ధనము మొ॥న మాయాపదార్థాలను నిలువ వుంచుకోవడం (కూడ పెట్టడం).

*శ్లో॥ వాస్తు, క్షేత్రం, ధనం,*
*ధాన్యం, ద్విపదాశ్చ చతుష్పదాః ।*
*శయనాసన యానం చ,*
*కుప్యం భాండమమీ దశ ॥*

భావం: ఇల్లు, వ్యవసాయము, ధనము, ధాన్యము, మనుష్యులు, పశువులు (ఏనుగులు, గుర్రాలు, ఆవులు మొ॥నవి), నిద్రకు సుఖాన్నిచ్చే సాధనాలు, వాహనాలు, నూతులు, పాత్రలు – ఈ విధంగా పరిగ్రహము పది రకాలు.

*శ్లో॥ యానపాత్ర మివాంబోధౌ గుణవానపి మజ్జతి ।*
*పరిగ్రహ గురుత్వేన సంయమీ జన్మసాగరే ॥*

భావం: తాడుతో కట్టిన గిన్నె అయినా బరువు వలన నీటిలో మునిగిపోతుంది. అలాగే పరిగ్రహమనే భారం చేత సంయమము (నిగ్రహము) కలవాడైనా కూడా సంసార సాగరంలో మునిగిపోతాడు.

*యతవాక్కాయమానసః-*

ఈ విషయంలో శ్రుతి ఇలా వున్నది _

*శ్లో॥ త్రిరున్నతం స్థాప్య సమం శరీరం*
*హృదీంద్రియాణి మనసా సన్నివేశ్య ।*
*బ్రహ్మోడుపేన ప్రతరేత విద్వాంస్రోతాంసి*
*సర్వాణి భయావహాని ॥*

భావం: వక్షస్థలము, కంఠము, శిరస్సు – ఈ మూడింటినీ ఎత్తుగా వుంచాలి. ఇలా శరీరాన్ని సమరేఖలో వుంచాలి. హృదయంలో ఇంద్రియాలను మనస్సు చేత నిలిపి ఓంకారమనే తెప్పచేత విద్వాంసుడు భయం కలిగించే సంసారం అనే నదిని దాటాలి.

ఏకాంత స్థలములో మొదట దర్భలు, దానిపై జింక చర్మము, దాని మీద వస్త్రాలు పరిచి ఎక్కువ ఎత్తు గాని, ఎక్కువ పల్లముగానీ లేని ఆసనము మీద కూర్చోవాలి. శరీరము, శిరస్సు, మెడ తిన్నగా వుంచి, నాసిక (ముక్కు) చివరి భాగంలో దృష్టి నిలిపి, దేనినీ చూడకుండా భ్రూమధ్యంలో కాని, హృదయంలో కానీ చూడాలి. అంటే కన్నులను సగం తెరిచి నాసికాగ్రాన్ని (ముక్కు చివరి భాగాన్ని) చూడాలి. ఇలా సగం తెరిచి వుంచడానికి కారణం కన్నులను పూర్తిగా మూసినట్లయితే చిత్తవృత్తి లయమై నిద్ర వస్తుంది. తెరచి వుంచితే బాహ్యపదార్థాల మీద దృష్టి మరలి చిత్తంలో సంకల్ప వికల్పాలు కలుగుతాయి.

**'ఓం' కారము ద్వారా పరబ్రహ్మధ్యానము**

యోగసూత్రాలలో 'తత్ర ప్రత్యేకతానతా ధ్యానం' అని వున్నది. ధారణా ప్రదేశంలో వృత్తిని స్థిరం చేయడం ధ్యానము.

'చిత్తవృత్తిని బ్రహ్మంతో కలపడానికి కేవలం వృత్తి సరిపోతుందా లేదా మరొక సాధనము ఏమైనా వున్నదా?' అనే సందేహం కలుగుతుంది. 'ఓం' అనేదే ఆ సాధనము.

ఓంకారాన్ని ఉచ్చరించడం వలన నామరూప రహితమైన సూక్ష్మమైన పరబ్రహ్మమే స్ఫురిస్తుంది. ఓంకారము వాచకము**, పరబ్రహ్మము వాచ్యము*.

ఓంకారము బ్రహ్మము యొక్క వాచకము, బ్రహ్మము వాచ్యము. వాచ్యవాచకాలకు భేదము లేదు. కాబట్టి ఓంకారాన్ని ఆలంబనగా తీసుకొని ధ్యానించాలి. 'అపరోక్ష వస్తువు ధ్యానించడానికి వీలుగా వుంటుంది. (అపరోక్ష వస్తువు అంటే ప్రత్యక్షంగా అనుభవమయ్యేది). కాని ఒకసారైనా చూడని పరోక్షమైన వస్తువును ఎలా ధ్యానించగలము?' అనే సందేహము కలుగుతుంది. పంచదశిలోని ధ్యానదీపంలో

**వాచ్యవాచకములు: ఏ పదాన్ని ఉచ్చరించడం వలన వినేవాడికి ఏ వస్తువు మనసులో స్ఫురిస్తుందో ఆ వస్తువు వాచ్యము. ఆ పదము వాచకము.

ఇందుకు సమాధానము వున్నది -

*శ్లో॥ వేదాంతేభ్యో బ్రహ్మతత్త్వమఖండైకరసాత్మకమ్ ।*
*పరోక్షమవగమ్యైత దహమస్మీత్యుపాసతే ॥*

భావం: ఉపనిషత్తుల చేత చెప్పబడిన (వాచ్యమైన) అఖండము ఏకరసము అగు పరమాత్మ తత్వాన్ని పరోక్షంగా తెలుసుకొని 'నేను బ్రహ్మాన్ని' అని ఉపాసించాలి. ధ్యానము పరోక్షంగానే జరుగుతుంది. పదార్థము (బ్రహ్మ పదార్థము) అపరోక్ష (ప్రత్యక్ష )జ్ఞానము కలిగిన తరువాత ఇక ధ్యానము చేయవలసిన అవసరమే లేదు.

*శ్లో॥ బోధోపాస్త్యోర్విశేషః క ఇతి చేదుచ్యతే శృణు ।*
*వస్తుతంత్రో భవేద్బోధః కర్తృతన్త్రముపాసనమ్ ॥*

(పంచదశి)

భావం: బోధకు (జ్ఞానబోధకు), ఉపాసనకు భేదమేమిటి? బోధ అంటే వస్తుతంత్రము. ఉపాసన అంటే కర్తృతంత్రము. జ్ఞానము ప్రమాణ, ప్రమేయములకు అధీనము. ఉపాసన విధి, నిశ్వాసము, పురుషుడు, ఇచ్ఛ, హఠము అనే వాటికి అధీనము. కాబట్టి బ్రహ్మధ్యానము పరోక్షంగానే జరుగుతుంది.

## పరమాత్మ యందు వృత్తిని నిలుపడానికి 'ఓం కారము' ఉత్తమ సాధనము

పరమాత్మను ధ్యానించటానికి 'ఓం'కారముతో వృత్తిని పరమాత్మ యందు నిలపాలి. దీనికి ఈ దృష్టాంతాన్నివ్వవచ్చు -

చిన్నపిల్లవాడు నడక నేర్చుకునేటప్పుడు మొదట మూడుచక్రాల బండి ద్వారా నేర్చుకుంటాడు. ఆ పిల్లవాడు మొదట ఆ బండి పట్టుకొని లేచి నిలబడతాడు. దానిని ముందుకు తోసి దానితోపాటు ముందుకు నడవడానికి ప్రయత్నిస్తాడు. ఈ విధంగా అతడు నడవడం నేర్చుకుంటాడు. అదేవిధంగా ఆత్మానుసంధానము నేర్చుకునే సాధకుడు 'అ'కార, 'ఉ'కార,' 'మ' కారాలనే మూడు చక్రాలు గల 'ఓం'కారమనే బండిని ఆధారంగా చేసుకుని భక్తి, వైరాగ్యాలనే రెండు కాళ్ళను బలంగా నేలపై నిలిపి నిలబడతాడు. 'ఓం'కారముతో బాటు వృత్తి సంస్కరింపబడి ఔన్నత్యాన్ని (ఉత్థాపనము ను) పొందడం చేత ఆత్మను ధ్యానించగలుగుతాడు. బండి చేతి నుంచి జారినప్పుడు పిల్లవాడు కొద్దిగా ఆగి పడిపోతాడు. అలాగే 'ఓం'కారము శాంతించగానే (ఆగగానే) వృత్తి తిరిగి వస్తుంది. మరలా పిల్లవాడు బండిని పట్టుకొని లేచి నిలబడి ముందుకు తోస్తాడు కదా! అలాగే సాధకుడు కూడా ఓంకారము ద్వారా వృత్తిని పైకి పంపి, వృత్తి ద్వారా ఆత్మధ్యానానికి ప్రయత్నిస్తాడు. 'ఓం' శబ్దము శాంతించగానే వృత్తి ఆగిపోతుంది.

ఇలా ఓంకారము ద్వారా ఆత్మధ్యానము సులభంగా జరుగుతుంది. కాబట్టే 'ఏకమాలంబనం శ్రేష్ఠం' అని శృతి చెబుతోంది. 'ఓం'కారమనే ఆలంబనము శ్రేష్ఠమైనది. కాబట్టి ఓంకారము ద్వారా సాధకుడు పరమాత్మను ధ్యానించాలి.

ఓంకారము ద్వారా ధ్యానం చేసే పద్ధతి
ముండకోపనిషత్తులో చెప్పబడింది -

*శ్లో॥ ప్రణవోధనుః శరోహ్యాత్మా,*
*బ్రహ్మ తల్లక్ష్యముచ్యతే ।*
*అప్రమత్తేన వేద్ధవ్యం*
*శరవత్తన్మయో భవేత్ ॥*

భావం: ఓం కారము ధనుస్సు, ఆత్మ బాణము, బ్రహ్మము లక్ష్యము. ప్రమత్తత (నిర్లక్ష్యం లేని) చెందని మనస్సు కల మానవుడు దీనిని భేదించగలడు. కాబట్టి బాణములాగే తన్మయుడవ్వాలి.

ధనస్సు బాణానికి గమనాన్నిచ్చే సాధనము. అలాగే ఓంకారము జీవాత్మ యొక్క వృత్తి అనబడే గుణానికి గమనాన్ని యిచ్చే సాధనము. బాణము లక్ష్యమునందు తన్మయత్వాన్ని పొందివుంటుంది. అలాగే జీవాత్మ యొక్క వృత్తి అనబడే బాణము బ్రహ్మముతో ఓంకారము ద్వారా తన్మయత్వాన్ని పొందాలి. **'ఓమిత్యేవం ద్యాయథ ఆత్మానమ్'** అని వేదంలో వున్నది. 'ఓం' అని ఆత్మను ధ్యానించాలి.

**- సశేషం**

# భగవాన్ శ్రీ భరద్వాజ

**శ్రీమతి శ్రీదేవి**

*మన పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ తల్లి సోదరియైన శ్రీమతి శ్రీదేవిగారి చేత విరచితమైన భగవాన్ శ్రీ భరద్వాజ గ్రంథము పూజ్య భరద్వాజ గురుదేవుల చరిత్రని విస్తారముగా మనకి అందిస్తుంది. శ్రీమతి శ్రీదేవిగారికి శ్రీ జిల్లెళ్ళమూడి అమ్మ ఆశ్రమంలో వున్నప్పటి నుండి భరద్వాజ గురుదేవులతో పరిచయము వున్నది. పూజ్య గురు దంపతుల కళ్యాణము అనంతరము శ్రీమతి శ్రీదేవిగారు యెక్కువ కాలము పూజ్యశ్రీ అమ్మగారి వద్దనే వుండటం వలన, పూజ్యశ్రీ మాస్టరుగారి బోధనలను, జీవిత గమనాన్ని ప్రత్యక్షంగా గమనించి అనేక కోణాలలో వారి యొక్క చరిత్రను మనకు అందిస్తున్నారు. పూజ్యశ్రీ మాస్టరుగారు బ్రహ్మానుభూతి పొందిన ఈ ఫిబ్రవరి నెల నుండి ఈ పవిత్ర గ్రంథాన్ని మన సాయిబాబా మాసపత్రికలో ధారావాహికంగా ప్రచురిస్తున్నాము — ఎడిటర్*

## పరమేశ్వరుని లీలావిభూతి

అవ్యక్తుడు, అవాఙ్మానస గోచరుడు అయిన ఆ విశ్వేశ్వరుని లీలావిలాసాలు ఆయనచే సృష్టింపబడిన యీ విశాల విశ్వంలో ఎప్పుడు, ఎక్కడ, ఏ విధంగా ప్రకట మౌతాయో ఎవరికెఱుక? మనకు కనిపించే యీ భూమి, ఆకాశం, సూర్యచంద్రులు, యింకా ఎన్నో కోటానుకోట్ల గ్రహగోళాలే కాక మన చర్మ చక్షువులకు గోచరం కాని అనంత లోకాలలో స్వామి కార్యకలాపాలేమిటో తెలిసికొనగలవారెవరు? ఈ మహాద్భుత సృష్టి విలాస క్రీడాకారుని అంతర్యానికి అద్దం పట్టగల సామర్థ్యం, అర్థం చేసుకొనగల శక్తి మనకు లేకున్నా –


ధర్మగ్లాని సంభవించిన సమయంలో తిరిగి ధర్మాన్ని ప్రతిష్ఠించేందుకై ఆ సృష్టికర్త తాను సృష్టించిన పుడమిపైకి తానే దిగి వచ్చి, నరరూపధారియై చరించటం, సాక్షాత్తు భగవంతుడే మానవుడిగా అవతరించటం అనే దివ్యలీల మహోన్నతమైన ఆ పరమేశ్వర తత్త్వాన్ని మనకు విదితం చేస్తుంది.

మాయలో పుట్టి, మాయలో పెరిగి, తుదకు మాయమైపోయే పాంచభౌతిక శరీరాల నాశ్రయించుకొని వున్న మనకు ఐహికాముష్మిక శ్రేయస్సు నందించేందుకై మహనీయుల రూపంలో మనకు సాక్షాత్కరించే యీ పరమాత్ముని క్రీడ – ఆయన లీలా విభూతులన్నింటిలోకీ తలమానికంగా భాసిస్తుంది.

అలాంటి మహనీయుల ఆవిర్భావం, వారి అవతార ప్రణాళిక ననుసరించి, వారు దేహధారులై వున్నంతకాలం వారు సృష్టిలోని జీవులను ఎలా ఉద్ధరించారో వారేమి చేశారో ఏమి చెప్పారో తెలిసికొనటం వలన, మోక్షమే లక్ష్యమై, మన జీవన ప్రయాణం గమ్యంవైపు నిరాటంకంగా సాగిపోతుందన్నది నమ్మదగిన సత్యం. అందుకు వారి జీవిత చరిత్రలే ప్రత్యక్ష సాక్ష్యం.

## దివ్యజనని శుభాశీస్సులు

పూజ్యశ్రీ మాస్టరుగారు చిరంజీవి శ్రీదేవికి జిల్లెళ్ళమూడిలో వున్నప్పటి నుంచీ పరిచయం. తర్వాత మా




వివాహానంతరం తాను యెక్కువగా మా యింట్లోనే వుండి సేవ చేసుకున్నది. పూజ్యశ్రీ మాస్టరుగారి వద్ద యెన్నో విషయాలు తెలుసుకున్నది. ఆయన చెప్పే అమృతవాక్కులు యెందరికో తెలియకుండా పోతున్నాయని, వాటిని వ్రాసి వుంచుకోలేకపోతున్నాననీ ఎంతో ఆవేదన చెందేది. అయితే కరుణామయుడైన పూజ్యశ్రీ మాస్టరుగారు శ్రీదేవి కోరికను, తపనను వృధా పోనివ్వలేదు. తనపై అపారకరుణతో తమ జీవితచరిత్ర వ్రాసే అదృష్టాన్ని ప్రసాదించారు. సాక్షాత్తూ దత్త స్వరూపులైన పూజ్యశ్రీ మాస్టరుగారి చరిత్రను వ్రాసే భాగ్యాన్ని పొందిన చి॥శ్రీదేవి ధన్యురాలు.

పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి చెప్పడము. శ్రీ సాయిబాబా గురించి చెప్పడమూ మన కర్తవ్యమే. అయితే ప్రచారమనేది మన సాధనలో ఒక భాగం మాత్రమే. మిగతా భాగాలను గూడ మనం సక్రమంగా నిర్వర్తించినపుడే గురుకృపకు సంపూర్ణంగా పాత్రులమవుతాము. ప్రచారం చేసేటప్పుడు కొంతమంది ఇతర మతాలను, ఇతర సాంప్రదాయాలను, ఇతర గురువులను, గురుబంధువులను విమర్శిస్తూ వుంటారు. దానిని గూడ ప్రచారంలో భాగంగా వారు భావిస్తుంటారు. దీనిని పూజ్యశ్రీ మాస్టరుగారు పూర్తిగా వ్యతిరేకించారు. మన త్రోవన మనం మనకు తెలిసిన వాటిని చెప్పుకుపోవడమేగాని, ఇతరులను విమర్శించడం తగదని ఆయన చెబుతుండేవారు. మన వ్యక్తిగత ఆధ్యాత్మికోన్నతికి అది ఎంతో హానికరమని ఆయన చెప్పారు.

మూలపురుషుడు చెప్పిన సిద్ధాంతాలకు వ్యతిరేకంగా చేసిన యే ప్రచారమైనా సరియైన ఫలితం యివ్వజాలదు. పైగా విపర్యయ ఫలితం గూడ వస్తుంది. ప్రచారమంటే కొందరి దృష్టిలో ఆ సాంప్రదాయానికి సాధ్యమైనంత ఎక్కువమందిని తీసుకురావడమని తలుస్తారు. కాని పూజ్యశ్రీ మాస్టరుగారు అలా చెప్పలేదు. అది సరియైన పద్ధతి కాదని, ఎన్ని లక్షలమంది ఆ సాంప్రదాయానికి వచ్చినట్లు కన్పించినప్పటికీ, చెప్పేవారి యొక్క సంస్కారాన్నిబట్టి మాత్రమే ఫలితముంటుందని ఆయన చెప్పేవారు, అందుకు ఉదాహరణగా శ్రీరాముని వద్దకు వచ్చిన పుచ్చుకుక్కను గూర్చి చెప్పేవారు. అట్టివారు బోధించినది మూలపురుషుడు చెప్పినదే అయినప్పటికీ దానిని ఆచరించనివారు చెప్పినందువలన దానిని అనుసరించిన వారందరూ సన్మార్గానికి వచ్చేవరకూ చెప్పినవారికి విముక్తి లేదని చెప్పేవారు. "అయితే పూర్తిగా ఆచరించగలిగినదాకా ప్రచారం చేయకూడదా? అయితే అందరినీ సత్సంగాలు నిర్వహించమని, బాబాగూర్చి చెప్పమనీ మాస్టరుగారు యెందుకు చెప్పారు?" అని కొందరికి సందేహం కలుగవచ్చు. పూజ్యశ్రీ మాస్టరుగారు అలా చెప్పలేదు. మనం బాబా చెప్పినట్లు మూలసూత్రాలను ఆచరించడానికి ప్రయత్నిస్తూ యితరులకు బోధించాలని చెప్పేవారు.

అందుకని పూజ్యశ్రీ మాస్టరుగారి గూర్చి, ఆయన సిద్ధాంతాల గూర్చి ప్రచారం చేసేటప్పుడు యితరులను విమర్శించక, మనలను మనం సరిచూసుకుంటూ వుండాలి. అప్పుడే మనం సక్రమంగా ప్రచారం చేయగలము. పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి చి॥శ్రీదేవి తనకు తెలిసినంతవరకు, తన అవగాహనమేరకు ఈ గ్రంథంలో తెలియజెప్పడానికి ప్రయత్నించింది. ఇదివరకు పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి చాలామందికి తెలిసివున్నప్పటికీ మరికొంత, మరొక్కసారి తెలుసుకుంటారనే శ్రీదేవి ఆకాంక్ష పూజ్యశ్రీ మాస్టరుగారు నెరవేరుస్తారని భావిస్తున్నాను. చి॥శ్రీదేవికి శ్రీ సాయినాథులు, పూజ్యశ్రీ మాస్టరుగారి శుభాశీస్సులు ఎల్లప్పుడూ వుంటాయని ఆశిస్తున్నాను.

ఇట్లు
ప్రేమతో, ఆశీస్సులతో
ఇ. అలివేలుమంగమ్మ
సర్వజిత్ నామ సంవత్సరం,
విజయదశమి
*21.10.2007*

**- సశేషం**

(గత సంచిక తరువాయి)

# శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు

*శ్రీమతి శ్రీదేవి*

మరొకసారి శ్రీ ఆనందమయి అమ్మ రాయ్ బహద్దూర్ గారి గురించి చెపుతూ, "పైకి సాధారణ వ్యక్తి లాగా కనిపించినా, ఆయన సంస్కారం కొనియాడదగినది. మేము షాహ్-బాగ్ లో వుంటుండే రోజులలో ఆయన మొదటగా నా వద్దకు రావటం జరిగింది. ఆ రోజులలో నేను యెవరి యెదుటకూ వచ్చేదానిని కాదు. ఆయన కారు శబ్దం వినగానే నేను యింటి లోపలికి వెళ్లిపోయేదాన్ని. నన్ను బయటకు రమ్మని యెంతగానో వేడుకునేవాడు. చాలాసేపటి తర్వాత నేను వెళ్లి కూర్చోగానే యెన్నెన్నో విషయాలు, సమస్యలు చెపుతుండేవాడు" అనేవారు శ్రీ ఆనందమయి అమ్మ.

శ్రీ ఆనందమయి అమ్మ ఢాకా ఆశ్రమం నుండి మరల రమణాశ్రమానికి వచ్చారు. ఒకరోజు ప్రాణకుమార్ బాబు అనే ఒక అమ్మ భక్తుడు ఒక గొప్ప యోగసాధకుడైన రామ్ ఠాకుర్ మహాశయులను అమ్మ వద్దకు తీసుకొని వచ్చాడు. ఆ యోగి శ్రీ ఆనందమయి మాతను దర్శిస్తూనే అమ్మకు సాష్టాంగ నమస్కారం చేశాడు. ఆయన అమ్మ యొక్క తండ్రికి సమకాలికులు. ప్రాణకుమార్ బాబు ఈ సందర్భంగా "తన తండ్రి వయసున్న రామ్ ఠాకుర్ గారు అమ్మకు నమస్కరించినపుడు అమ్మ వారికి ప్రణామం చేయలేదేమిటి? అని ఒక భక్తుడు నా వద్ద తన సందేహాన్ని వెలిబుచ్చాడు" అని శ్రీ ఆనందమయి అమ్మతో అన్నప్పుడు అమ్మ యిలా అన్నారు, 'రామ్ ఠాకూర్ మహాశయుల చరణకమలాలు నాకు శిరోధార్యాలు. కానీ నేనేమి చేసేది? అందరి వలె నేను వారికి నమస్కరించలేకపోతున్నాను. యెందుకో గాని నా శరీరం అందుకు సహకరించడం లేదు. ఈ విషయమే నువ్వు రామ్ ఠాకూర్ గారికి తెలియపరిస్తే మంచిది". ఇదేవిధంగా కొందరు భక్తులు రామ్ ఠాకూర్ గారి వద్ద కూడా ప్రస్తావించడం జరిగింది. "మహాయోగి పుంగవులు మీవంటి గొప్పవారు మీ కుమార్తె వయసున్న అమ్మకు నమస్కరించడం యేమిటి?" అని అన్నప్పుడు ఆయన, "శ్రీ ఆనందమయి మాత యెవరనుకుంటున్నారు? సాక్షాత్తూ భగవతీమాత. జ్ఞానపూర్ణులైన ఆ తల్లి ముందు నేనెంతటివాడను? నాకంటే వయసులో చిన్నవారయినప్పటికీ అర్హత కలిగినవారయినప్పుడు, అటువంటి వారికి నేను ప్రణామం చేస్తాను. శిరస్సు వంచి వారి ముందు నేను మోకరిల్లుతాను. అమ్మ నాకు అత్యంత పూజనీయురాలు. ఆమెను దర్శించి నేను ధన్యుడనైనానని భావిస్తున్నాను" అని సమాధానం యిచ్చారు. అంతేకాదు ఆయన తరచూ భక్తులతో, "మీరంతా తరచూ అమ్మను దర్శిస్తూ వుండండి. ఆ తల్లి దర్శనమాత్రం చేతనే మనం తరించగలమనటంలో సందేహం లేదు" అని చెపుతుండేవారు.

రమణాశ్రమంలో ఒక రోజంతా అమ్మ పడుకునే వున్నారు. సాయం సమయంలో లేచి మైదానంలోకి వెళ్లి కూర్చున్నారు. భక్తులందరూ అమ్మ చుట్టూ కూర్చొనివున్నారు వారిలో 'సారస్వత సభ' అనే సంస్థలో సభ్యుడైన శీతల్ బాబు అనే భక్తుడు అమ్మతో యిలా అన్నాడు, "అమ్మా! మీరు యీ రోజంతా పడుకునేవున్నారు. ఆ సమయంలో మీరు దైవీభావంలో వుండి, దైవంతో మమేకమై వుండి వుంటారు. అందువలననే బాహ్యస్మృతి అనేది లేకుండా వున్నారు. మరలా యిప్పుడు ఆ స్థితి నుండి బయటకు

వచ్చి యిలా మా అందరితో మాట్లాడుతూ కూర్చున్నారు. అవునా?" అమ్మ నవ్వుతూ, "అయితే మీరందరూ భగవంతునికి వేరుగా వున్నారా? మీరంతా భగవత్స్వరూపులు కారా? సర్వత్రా భగవంతుడే నిండి వుండగా వేరే స్థితి అంటూ యేముంటుంది? నాకైతే దైవీభావంలోకి వెళ్లడం, మరల ఆ స్థితి నుండి బయటకు రావడం అనేది యేమీ అనిపించదు. ఎల్లప్పుడూ ఒకే స్థితిలో వుంటాను. బాహ్యశరీరంలో మాత్రమే రకరకాలైన యోగక్రియలు, మార్పులు వ్యక్తమౌతుంటాయి. అంతే!" అన్నారు.

బాహ్యంగా కనిపించే శరీర భంగిమలలో ఎన్నో మార్పులు వ్యక్తం అవుతున్నప్పటికీ ఆంతర్యంలో అమ్మ యెప్పుడు ఒకే స్థితిలో వుంటారన్నది నిజం. ఈ విషయం గురించి గురుప్రియ యిలా చెప్పారు, "సిద్ధేశ్వరిలో వున్నప్పుడు అమ్మ అస్వస్థులయిన సమయంలో ఆమె శరీరం యెంతగానో కృశించిపోయింది. ఒక్కొక్క సమయంలో శరీరం రాయివలే కదలక మెదలక చేష్టలు లేకుండా పడివుండేది. అయినప్పటికీ అమ్మ తన శరీరంతో తనకు యేమీ సంబంధం లేనట్లుగా మామూలుగానే మాతో నవ్వుతూ మాట్లాడుతుండేవారు". తన యొక్క ఆ స్థితి గురించి అమ్మ "అలాంటి సమయంలో కూడా నేను మాట్లాడుతూనే వుండేదాన్ని. కన్నులు తెరుచుకునే వుండేవి. అయినప్పటికీ శరీరమంతా ఒక గట్టిరాయి వలె బిగుసుకుపోయి వుండేది. మాట్లాడుతూ వుండగానే వున్నట్లుండి మాటలు ఆగిపోయేవి. కన్నులు మూతలు పడేవి. అలాంటి శారీరిక మార్పులు ఎన్నో జరుగుతుండేవి. అవన్నీ చూసి నేను సమాధి స్థితిలో వున్నానని మీరు అనుకునేవారు. అయితే మాట్లాడుతూ కళ్ళు తెరుచుకుని వున్నంత మాత్రాన సమాధి స్థితిలో వుండకపోవటం అనేది వుంటుందా?" అంటూ అమ్మ బాగా నవ్వసాగారు

"ఆ రోజు అమ్మ మాతో ఆ విధంగా చెప్పిన తర్వాత అమ్మ స్థితి మాకు కొంతవరకు అర్థం అయింది. ఒక్కొక్కసారి అమ్మ దారివెంట నడిచేటప్పుడు, సంకీర్తనలు జరిగే సమయంలోను మాట్లాడుతున్నప్పుడు వున్నట్లుండి అమ్మ వైఖరి మారిపోయేది. ఎన్నో శారీరిక యోగక్రియలు, ముద్రలు వ్యక్తమయ్యేవి. రెండు మూడు రోజుల వరకు కూడా అమ్మ అటువంటి స్థితిలోనే వుండిపోయేవారు. దానిని మేము సమాధి స్థితి అని భావించే వాళ్ళం. అయితే అమ్మను, అమ్మ స్థితిని ఎంతటి వారైనా అంచనా వేయగలరా? అమ్మ లో వ్యక్తమయ్యే వివిధ క్రియలను వివరించాలని భావించటం కేవలం మా అమాయకత్వమే అవుతుంది".

ఎందరో సాధకులు, యోగులు అమ్మ సన్నిధి భాగ్యాన్ని పొందాలన్న కోరికతో రమణాశ్రమానికి వచ్చి అక్కడ కొంతకాలం వుండి వెళ్తుండేవాళ్లు. ఒకసారి 'సాధనాసమరం' అనే ఆశ్రమంలో వుండే ఒక సాధకుడు రమణాశ్రమానికి వచ్చాడు. అతని పేరు అతుల్ ఠాకూర్. అతడు ప్రతిరోజు వుదయాన ఒక పెద్ద గంపనిండా పువ్వులు తెచ్చి అమ్మను పూజించేవాడు.

ఒకసారి ఢాకాలో ఒక పండిత సదస్సు జరిగింది ఆ సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి ఎందరో గొప్ప గొప్ప పండితులు ఢాకా వచ్చారు. కలకత్తా నుండి మహేంద్ర సర్కార్ అనే అమ్మ భక్తుడు కూడా వచ్చాడు. వాళ్ళందరూ అమ్మ గురించి విని అమ్మను దర్శించేందుకై ఆశ్రమానికి వచ్చారు. ఆ పండితులతో పాటు ఊరిలోని విద్యావంతులు, ప్రొఫెసర్లు కూడా ఆశ్రమానికి వచ్చారు. వారంతా అమ్మతో యెంతోసేపు ఆధ్యాత్మిక చర్చలు జరిపారు. కొంతసేపైన తర్వాత వారు అమ్మ చిన్ననాటి జీవిత విధానం, అప్పటి ఆమె స్థితి గురించి తెలియజేయవలసిందిగా అమ్మను ప్రార్థించారు. అమ్మ కొన్ని విషయాలు చెప్పారు. వాటిని వారంతా యెంతో భక్తిశ్రద్ధలతో కాగితాలపై వ్రాసుకున్నారు. వాటిలో ఒక ముఖ్యమైన విషయం అమ్మ యిలా తెలియజేశారు:

బాజిత్ పూర్ లో వుండగా అమ్మ మేనమామ సోదరులైన నిశిబాబు, జానకీబాబు అనే యిద్దరు యువకులు ఒకసారి అమ్మ ఒక అలోకిక భావావస్థలో వుండగా "అమ్మా! అసలు మీరెవరు?" అని అడిగారు. అయితే అప్పుడు అమ్మ నోటి నుండి వచ్చిన సమాధానాన్ని వారు అప్పటికప్పుడే మరచిపోయారు. అమ్మ ఆ విషయం చెపుతూ నవ్వుతూ, "అది వెల్లడి కావలసిన సమయం కాదు కనుక అలా జరిగింది" అని అన్నారు. పండితులు కూడా అమ్మను యిన్ని సంవత్సరాల తర్వాత యిదే విషయాన్ని

గురించి ప్రశ్నించారు, "అమ్మా! అసలు మీరెవరో చెపుతారా?" అని. అమ్మ కొంచెం సేపు మౌనంగా వున్నారు. తర్వాత, "ఇందులో నేను చెప్పటం అంటూ యేదీ వుండదు. ఆ రోజు నా నోటి నుండి యేమి వెలువడిందో అందులో నా ప్రమేయం యేమీ లేదు. బుద్ధిపూర్వకంగా నేను యేదీ చెప్పను" అన్నారు. అమ్మ అలా అంటుండగానే అమ్మ ముఖం యెరుపు రంగులోకి మారిపోయింది. కళ్ళనుండి నీళ్లు కారటం ప్రారంభమైంది. అప్పుడు అమ్మ నోటి నుండి వెలువడిన మాటను యిలా వెల్లడించారు. ఆ రోజు నా నోటి నుండి వ్యక్తమైన పదం యిదే! 'పూర్ణ బ్రహ్మ నారాయణుడు'. అలా అంటూ అమ్మ ఒక చిత్రమైన అలౌకిక భావావేశ స్థితికి లోనైనారు. అయినా ఆ స్థితిలోనే అమ్మ పండితులతో మాట్లాడుతూనే వున్నారు. చాలాసేపు సంభాషించిన తర్వాత వారంతా అమ్మ వద్ద సెలవు తీసుకొని వెళ్ళిపోయారు.

వాళ్లంతా వెళ్లిపోయిన తర్వాత అమ్మ గదిలోకి వచ్చి పడుకున్నారు. ఇంకా అటువంటి భావావేశ స్థితిలోనే చాలాసేపు వున్నారు. కళ్ళనుండి నీరు ప్రవహిస్తూనే వున్నది. ఆ పరిస్థితి చూచి శ్రీ భోలానాథ్ గారు, "నీ స్థితిని గురించి బయటకు ప్రకటించడం నిషిద్ధం అని చెప్పావు కదా? మరి యిప్పుడు యెందుకు చెప్పావు?" అని అడిగారు. అమ్మ "నా యిష్టప్రకారం నేనేమీ చేయను. బహుశా వ్యక్తపరచవలసిన సమయం వచ్చింది కనుక యీ విధంగా చెప్పటం జరిగిందని అనిపిస్తున్నది" అన్నారు.

ఈ సంఘటన జరిగిన కొంతకాలానికి ఉషాదీదీ వచ్చారు. బాజిత్ పూర్ లో వుండగా అమ్మతో ఉషాదీదీ పరిచయం, అప్పటి నుండి ఆమెకు అమ్మతో యేర్పడిన అనుబంధం లోగడ ప్రస్తావించటం జరిగింది. ఆమె అప్పుడప్పుడు అమ్మ దర్శనార్థం వస్తుండేది. పండితులతో ఆనాడు అమ్మ జరిపిన సంభాషణలు ఆనాటి విశేషాలు అన్నీ మేము ఉషాదీదీకి చెప్పాము. ఆమె "అమ్మ యింతకాలం తర్వాత తన గురించి తాను చెప్పారు. కానీ దానివలన చేకూరే ప్రత్యేకమైన ప్రభావం లోకానికి యేముంటుంది? అమ్మ యెవరో యిప్పటికే ప్రకటమయి వున్నారు కదా! ప్రపంచం అంతటికి అమ్మ జగన్మాతగా ప్రసిద్ధి చెందారు" అన్నది. ఆమె యిలా అంటున్నప్పుడు అమ్మ అక్కడే వున్నారు. అమ్మతో ఉషాదీదీ "అమ్మా! ఆ రోజు మీ గురించి మీరు 'పూర్ణ బ్రహ్మ నారాయణుడు' అని అన్నారు కదమ్మా" అన్నది. ఆ మాట వింటూనే అమ్మ ముఖం, కన్నులు ఎర్రగా మారిపోయాయి. కన్నుల నుండి జలజలా కన్నీరు కారసాగింది. అమ్మలోని ఆ మార్పు చూసి ఉషాదీదీ భయంతో, బాధతో, సిగ్గుతో అమ్మ కాళ్లు పట్టుకొని అలా మాట్లాడినందుకు తనను క్షమించమని వేడుకున్నది. "అమ్మా! నేను అలా మాట్లాడి అపరాధం చేశానా?" అన్నది. ఉషాదీదీని ఓదారుస్తూ అమ్మ "నీవేమీ అపరాధం చేయలేదు. ఎప్పుడు యేమి జరగాలో అది జరిగి తీరుతుంది. అలా కాకుంటే యింతకాలం తర్వాత నువ్వు రావటం యిలా మాట్లాడటం యెందుకు జరుగుతుంది?" అని అన్నారు.

బాజిత్ పూర్ లో వుండగా అమ్మ తనకై తానే దీక్షాగ్రహణం చేసుకొనడం జరిగింది. దీక్షాగ్రహణం తర్వాత అమ్మ నోటి నుండి ఎన్నో సంస్కృత శ్లోకాలు, బీజాక్షరాలతో కూడిన మంత్రాలు వాటి అంతట అవే ప్రకటం అవటం జరిగింది. అమ్మ ఈ విషయాలను గురించి యిలా చెప్పారు: "వీటన్నింటి కంటే ముందుగా నా నోటి నుండి ఓంకార నాదం వెలువడింది. నా ప్రయత్నం యేమీ లేకుండానే లోపల నుండి ఎవరో తరుముకొస్తున్నట్లుగా యివన్నీ వ్యక్తం అవుతుండేవి. ఆసనాలు, ముద్రలు, దీక్షాగ్రహణం కంటే ముందుగానే ఈ శరీరంలో సంభవిస్తుండేవి.దీక్షతీసుకున్నతర్వాత మరింత యెక్కువగా వ్యక్తం కావడం జరిగింది. వీటన్నింటి ప్రభావం వలన కాబోలు కొన్ని కొన్ని సమయాలలో ఋతుధర్మం ఆగిపోయేది. ఆ తర్వాత కొద్ది కాలానికే ఋతుధర్మం పూర్తిగా ఆగిపోవడం జరిగింది".

అలా అమ్మ కొన్ని కొన్ని సమయాలలో సందర్భాలలో తన స్థితిని గురించి ఒక అలౌకికస్థితిలో వున్నప్పుడు వ్యక్తపరచడం జరుగుతుండేది. అయితే అమ్మ ఎప్పుడూ ఒకటే విషయాన్ని చెప్పేవారు – "నా చర్యలలో నా ప్రమేయం యేమీ వుండదు. ఎప్పుడు యేది జరగాలో అది అప్రయత్నంగా జరిగిపోతుంది" అని!!

**- సశేషం**

# బుద్ధ ధ్యాన హృదయము

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

*"గౌతమ బుద్ధుని ఉపదేశము మనస్సును లక్ష్యంగా తీసుకుంటుంది. పామర మనస్సుతో ఆరంభించి పరిపూర్ణమైన మనస్సుతో ముగుస్తుంది. బుద్ధుడు మనస్సును సంస్కరించే విధానాన్ని కనిపెట్టాడు. కనుకనే ఆయన సిద్ధాంతం నేటికీ నిత్యసత్యంగా వుండిపోయింది" అంటూ, గౌతమ బుద్ధుడు ధ్యానం గురించి తెలిపిన ఎన్నో అమూల్యమైన విషయాలను పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజులవారు 'బుద్ధ ధ్యాన హృదయము' అనే ఈ గ్రంథం ద్వారా మనకు అందించారు. సాధకులు చదివి తీరవలసిన ఈ గ్రంథాన్ని సాయిబాబా మాసపత్రిక మార్చి 2024 సంచిక నుండి ధారావాహికంగా పాఠకులకు అందిస్తున్నాము.*

*—ఎడిటర్*

బుద్ధుని ఉపదేశము సార్వజనికము, నిత్యనూతనము. ప్రతి మానవునికి అతిసమీపమైన మనస్సును లక్ష్యంగా తీసుకుంటుంది. పామర మనస్సుతో ఆరంభించి పరిపూర్ణమైన మనస్సుతో ముగుస్తుంది.

మనసు ద్వారానే మనకు బాహ్యజగత్తు, శరీరంకూడా అనుభవమౌతాయి. కనుక "మనస్సర్థమైతే అన్నీ అర్థమౌతాయి" అని బుద్ధుడు 'రత్నమేఘసూత్రం' లో చెప్పారు. 'బాహ్యాభ్యంతరాలలోని మంచికి చెడుకీ మనస్సే కారణం!' అంటుంది అంగుత్తరని కాయసూత్రం. కనుక ప్రపంచం చెడు గురించి వెనుతిరగడం అంటే మనసు పరివర్తన చెందడమే. దృఢమైన అంతరంగిక సంస్కారం వల్లనే లౌకిక వ్యవహారాలను సలిపే మనస్సు యొక్క పరిధిలోని క్రియలు సంస్కరింపబడగలవు. అయితే యిలా ప్రతి వ్యక్తిలోను పరివర్తన రావడం సాధ్యమా? అలా వచ్చేదాకా సమాజం అన్యాయాలతో మగ్గిపోవలసినదేనా? చరిత్రలో చూస్తే పట్టుదల, లోచూపు గల కొద్ది వ్యక్తులు యేర్పడినా చాలు; వారి అడుగుజాడలలో తక్కినవారు నడవడం జరుగుతుందని తెలుస్తుంది. మంచికైనా చెడుకైనా జరిగేది మాత్రం యిదే!

బుద్ధుడు మనస్సును సంస్కరించే విధానాన్ని కనిపెట్టాడు. కనుకనే ఆధునిక శాస్త్రీయ ప్రగతివల్ల ఆయన సిద్ధాంతం పాతబడిపోలేదు. నేటికీ నిత్యసత్యంగా వుండిపోయింది. మనస్సు గురించి బుద్ధుడు మూడు ప్రధానసూత్రాలు చెప్పాడు.

ఎ) మనకు అతిసమీపమై కూడ అతిదురవగాహమైన మనస్సు యొక్క అసలు తత్వాన్ని తెలుసుకోవడం.

బి) ఏరీతినైనా చక్కగా సంస్కరించడానికి అనువుగా మెత్తగా అనిపిస్తూవే ఒక పట్టాన లొంగని మనస్సును సరియైన పద్ధతిలో రూపొందించడం.

సి) ఎన్నో బంధాలలో చిక్కుబడి వున్నప్పటికీ ఏక్షణాన్నైనా విముక్తి చెందగల మనస్సును ముక్తి చెందించడం.

ఇలా మనస్సును సంస్కరించడానికి బుద్ధుడు చెప్పిన

ప్రధాన సూత్రాన్ని 'శ్రద్ధ కలిగివుండు' అనే ఒక్క వాక్యంలో పొందుపరచవచ్చు. దీనినే 'స్మృత్యుపస్థానము" అన్నారు (సతిపథ్థాన). అయితే శ్రద్ధ దేనిపట్ల కలిగి వుండాలి? ఎలాగు? అనే ప్రశ్నలకు సమాధానమే ఆయన బోధంతా! సరియైన స్మృతిని కలిగి యుండడమే పై చెప్పిన మూడు లక్ష్యాలను సాధించడానికి ఏకైక మార్గమని బుద్ధుడు బోధించాడు.

## స్మృతి లేక శ్రద్ధ

స్మృతి సామాన్య మానవునకు యెంతో దూరంగా వున్న ఒకానొక ఆధ్యాత్మిక స్థితి అని తలచనక్కరలేదు అది నిత్యజీవితంలో అందరికీ సుపరిచితమైనదే. అది లేకుంటే ఏ వస్తువులను గుర్తించడం సాధ్యంకాదు. ఏ వస్తువైనా మనపై చాలినంత ప్రభావం కలిగి వుంటే దానిపట్ల మన శ్రద్ధ మేల్కొని, మన శ్రద్ధ దానివైపుకు మళ్ళి దాన్ని గుర్తించడం జరుగుతుంది. అది శ్రద్ధ యొక్క ప్రాథమికమైన రూపం. దీనివల్ల మన ఎరుక మేల్కొంటుంది. క్షణానికి లెక్కపెట్టలేనన్నిసార్లు యీ క్రియ మనలో జరుగుతూ వుంటుందని (అది) ధర్మసూత్రాలలో బుద్ధుడు చెప్పాడు. ఇటువంటి ప్రాథమికమైన స్మృతివల్ల ఆ వస్తువును చాలా స్థూలంగాను, అస్ఫుటంగాను మాత్రమే గుర్తించడం జరుగుతుంది. ఆ పస్తువు మనకా శక్తిని కలిగించినట్లైతే యీ ప్రాథమిక అనుభవం మరింతగా స్మృతిని మేల్కొల్పుతుంది. అప్పుడు ఆ వస్తువు యొక్క వివిధ లక్షణాల పైనేగాక దానికి మనతోగల సంబంధం గూర్చి మన స్మృతి పనిచేస్తుంది. అప్పుడు వర్తమానంలోని అనుభవం గతంలోని సజాతీయమైన గతానుభూతుల స్మృతులను మేలుకొల్పి వాటితో సమన్వయపరుస్తుంది. దీనినే సైకాలజీలో Associated Thinking అంటారు. ఈ ప్రక్రియలో మన జ్ఞాపకశక్తి పాల్గొంటుంది, గుర్తింపు పాల్గొంటుంది. అందుకే యీ అనుభవాన్ని యీ రెండర్థాలుగల స్మృతి అనే పదంతో సూచించడం జరిగింది. ఇక గుర్తింపులో రెండవ దశలో వస్తువుల సామాన్య ధర్మాన్ని గురించి యోచన కలుగుతుంది (Abstract Thinking). ఉదాహరణకు తెల్లటి వస్తువులను అన్నిటికీ సామాన్యమైన తెలుపు అనే ధర్మాన్ని గురించి యోచిస్తుంది. ఈ రెండవ దశలో నాలుగంశాలున్నాయి.

1. వస్తువు గూర్చిన వివరాలు గుర్తించడం.
2. దాని గూర్చిన తన భావం (ఇష్టాయిష్టాలు).
3. అది మేల్కొల్పిన స్మృతి సంచయం.
4.ఈ స్మృతులన్నింట్లోనూ గల సామాన్య ధర్మాలను గురించిన యోచన.

సామాన్య మానవుల మానసిక జీవితమంతా యీ రెండవ దశకు చెందినదే. నిత్యజీవితంలోని వస్తువులను గుర్తించడం దగ్గరనుండి, శ్రద్ధగా ఒక పనిలో నిమగ్నమవడం నుండి, శాస్త్రజ్ఞుల పరిశోధనలు, తత్వశాస్త్రజ్ఞుడి సూక్ష్మ యోచనల వరకూ అన్ని యిందులో చేరినవే! అయినప్పటికీ యీ రకమైన విషయ పరిజ్ఞానం నిర్దుష్టమైనదని చెప్పలేము. వాటి విషయమై మన యిష్టాయిష్టాలు గుడ్డిగా యేర్పరచుకున్న అభిప్రాయాలతో మిళితమయ్యే వుంటుంది. వీటన్నింటిలో ప్రబలమైనదీ ప్రధానమైనదీ ఆ వస్తువులకాధారంగా ఒక శాశ్వతమైన పదార్థం వున్నదని, ప్రాణులలో వ్యక్తిత్వమున్నదని తలచటమే! బుద్ధ ధర్మాన్ననుసరించి మనస్సును మరింత పటిష్ఠం చేయని వారందరూ యీ స్థితిలో వుండిపోవలసినదే.

ఆ విధంగా సంస్కరించుకుంటే వచ్చే మూడవ స్థితే బుద్ధుడు చెప్పిన సమ్యక్ స్మృతి. ఇది సమ్యక్ లేక సరియైన స్థితియని చెప్పడానికి కారణాలు - మన మనసులో దాగి వున్న యిష్టాయిష్టాలు గుడ్డి అభిప్రాయాల వలయాన్నుంచి మనస్సును విముక్తం చేస్తుంది; యిది సమ్యక్ దృష్టి (Right Understanding) కి ఆధారం. సరియైన పనిని సరియైన విధంగా చేయడం నేర్పుతుంది. బుద్ధుడు చెప్పిన దుఃఖనాశము అనే లక్ష్యసాధనకు ఉపకరిస్తుంది. సమ్యక్ స్మృతికి గురియైన యింద్రియ మనో విషయాలు సరియైన విశ్లేషణకు (Analysis) గురియై నందువలన వాటి గూర్చి సరియైన సిద్ధాంతాలను యేర్పరుచుకొని వాటితో సరిగా వ్యవహరించి వాటిని గూర్చిన సరియైన నైతిక నిర్ణయాలను చేయడంలో సహకరిస్తుంది. ఇలా లభించిన సరియైన అవగాహన బుద్ధుడు చెప్పిన సరియైన అవగాహనకు 'సర్వ ప్రకృతి క్రియలు అశాశ్వతములు, దుఃఖమయములు, నిస్సారములు, వ్యక్తిత్వ రహితములు' అన్నదానికి ఆధారమౌతుంది. సమ్యక్ స్మృతిని అభ్యసిస్తూ వున్నప్పుడు సమ్యక్ దృష్టిని చవిచూస్తాడు సాధకుడు. 'సమ్యక్ దృష్టి' యను తర్వాత దశకు చేరడంలో స్మృతి లేక శ్రద్ధయొక్క తీవ్రత, నిర్దుష్టతలను పెంచడమే యిమిడియున్నది.

**- సశేషం**

# భరద్వాజ గురుదేవుల బ్రహ్మానుభూతి వేడుకలు!

**శ్రీమతి టి.పద్మావతి**

ఒంగోలు సమీపంలో గల గుమ్మళంపాడు గ్రామంలో 'శ్రీ అలివేలుమంగమ్మ తల్లి దివ్యసన్నిధానము' నందు, పూజ్యశ్రీ మాస్టరుగారి బ్రహ్మానుభూతి పర్వదినం ఫిబ్రవరి 9వ తేదీన మహోత్సవంగా జరిగింది.

ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పూజ్యశ్రీ అమ్మగారు "అపూర్వ సంగమము అది అద్భుత సంగమము, సాయినాథుని భరద్వాజుని అపూర్వ సంగమము.." అంటూ ఒక అత్యద్భుతమైన గీతాన్ని రచించారు. పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారు బ్రహ్మానుభూతి పొందిన సన్నివేశాన్ని, వారి అంతరంగాన్ని అత్యంత ఉన్నతంగా, రమణీయంగా ఈ గీతంలో ఆవిష్కరించారు పూజ్యశ్రీ అమ్మగారు. (ఆ రమణీయ గీతాన్ని ఈ లింకు ద్వారా వినగలరు: https://youtu.be/Y0bY2K6U2Es?si=yXcy3alKubCt-f97B )

ఆ రోజు ఉదయం పూజ్యశ్రీ బాబాగారికి, పూజ్యశ్రీ మాస్టరుగారికి, పూజ్యశ్రీ అమ్మగారికి మేలుకొలుపుతో సేవలు మొదలయ్యాయి. తర్వాత మంగళ స్నానాలు, అనంతరం ముగ్గురు మూర్తుల చిత్రపటాలను, నిత్యసత్యులై కొలువైవున్న పూజ్యశ్రీ అమ్మగారి సమాధిని, ప్రత్యేకంగా అలంకరించారు. పూజ్యశ్రీ బాబా, పూజ్యశ్రీ అమ్మగారు యిరువైపులా పరివేష్టితులై వుండగా, పూజ్యశ్రీ మాస్టరుగారు తన సన్నిధికి చేరవచ్చిన భక్తులందరి కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారా అన్నట్టు వారిద్దరి మధ్యలో చిత్రపటం రూపంలో ఆశీనులై వున్నారు. అల్పాహార నివేదనానంతరం పూజ్య గురుదంపతుల ప్రియపుత్రులు శ్రీ ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ గారు, శ్రీమతి లయ రాగిత దంపతులచే విశేషమైన పూజ జరిగింది. భక్తజనులందరూ భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. పూజానంతరం శ్రీ ద్వారక బాబుగారు కొంతసేపు సత్సంగం చేశారు. అందులో కొన్ని అంశాలు:

'విశ్వమంతా ఏ మహత్తర చైతన్యంలో సంకల్ప మాత్రంగా వున్నదో దానితో శ్రీ సాయినాథులవారు తాదాత్మ్యం చెందివున్నారు అని, సాయినాథునికి అన్యంగా మరేమీ లేదని తన రూపంతో సహా సమస్తమూ భగవంతుడేనని పూజ్యశ్రీ మాస్టరుగారికి అనుభవం కలిగిన రోజు ఈ రోజు!! ఈ అనుభవాన్ని ప్రసాదించిన సాయినాథుని తత్త్వానికి ఆశ్చర్యం, ఆనందం పొంది, శ్రీ గురు చరిత్ర గ్రంథ పారాయణ ద్వారా, శ్రీ సాయినాథులవారే తన గురువని తెలుసుకొని వారికి అంకితమయ్యారు పూజ్య గురుదేవులు శ్రీభరద్వాజ గారు!

ఈ ఘట్టానికి చాలా ప్రాముఖ్యత ఉంది. కొన్ని తరాల కిందట నుంచి నామము గొప్పదా, మంత్రం గొప్పదా, విగ్రహారాధన గొప్పదా అన్న చర్చల్లో వుండిపోయారు తప్పించి, అనుష్ఠించి గట్టెక్కిన వాళ్ళు కనిపించలేదు. ఆదిశంకరులు, రమణ భగవాన్, రామకృష్ణ పరమహంస మొదలైన మహనీయులందరు 'ఆచరణ ముఖ్యం' అన్నారు. నామజపంతో తరించే వాళ్ళున్నారు, మంత్ర జపంతో తరించేవాళ్ళున్నారు. విగ్రహారాధనతో కూడా తరించేవాళ్ళున్నారు. వీరందరిలో సాధారణ అంశం ఏమిటంటే వాటిని సరిగ్గా స్వీకరించే వ్యక్తి సమర్థత! ఆత్మానుభవాన్ని ప్రసాదించగలిగిన గురు రూపంలో వున్న భగవంతుడు ఒక భాగం, దాన్ని పొందడానికి సిద్ధంగా

వ్యక్తి రూపంలో వున్న సాధకుడు ఇంకొక భాగం, ఈ రెండే ముఖ్యమైనవి!! ఎటువంటి అపోహలు పొందడానికి వీలులేని, గురు శిష్య సంప్రదాయం పునరుద్ధరించబడిన అద్భుతమైన రోజు ఇవాళ!! భగవద్గీత సారాంశం ఎవరిలో పరిపూర్ణత చెందిందీ అంటే, పూజ్యశ్రీ మాస్టరుగారిలో పరిపూర్ణత చెందింది అని చెప్పొచ్చు. ఎందుకంటే అర్జునుడికి శ్రీకృష్ణుడు విశ్వరూప సందర్శనం ప్రసాదించిన ఘట్టాన్ని, పూజ్యశ్రీ మాస్టరుగారికి సాయినాథులవారు ఆత్మానుభావాన్ని ప్రసాదించిన ఘట్టాన్ని ఒకసారి చూసుకుంటే, ఈ విషయం అర్థం అవుతుంది. అర్జునుడు కురుక్షేత్రంలో యుద్ధరంగానికి వెళ్ళాడు, పూజ చేయడానికి మాత్రం కాదు. తపస్సు చేసి శివుని ప్రసన్నం చేసుకుని, పాశుపతాస్త్రం అడిగాడు యుద్ధం చేయడానికి! ఇక కురుక్షేత్రంలో కౌరవ సేనలను చూసి, వీళ్లందరినీ చంపి ఆ రక్తపు కూడు తినే కంటే యుద్ధం చేయకుండా వుండడం మేలని, విషాదం కలగడం వల్ల, కృష్ణ పరమాత్మ అతనికి భగవద్గీతను బోధించి విశ్వరూప సందర్శనం ప్రసాదించాడు. అదేవిధంగా పూజ్యశ్రీ మాస్టరుగారి ఉపనయనానికి మహామహులందరి చేత ముహూర్తం పెట్టించారు. ఆ సందర్భంలో వారి పెద్ద అన్నగారి కుమారుడు వీరికి అత్యంత ప్రీతిపాత్రమైన వాడు మరణించడంతో వారిలో అనేక ప్రశ్నలు ఉదయించి సృష్టి గురించి, జనన మరణాల గురించి ఆలోచిస్తూ అన్వేషిస్తున్న సందర్భంలో, వారు శిరిడీ వెళ్లినప్పుడు అక్కడ శ్రీ సాయినాథుడు, 'ఈ సృష్టి అంతా తన రూపంగా' అనుభవాన్ని ప్రసాదించారు. ఆ సమయంలో పూజ్యశ్రీ మాస్టరుగారు మంత్రంగానీ, నామజపం గానీ, పూజకానీ చేయలేదు. అన్వేషణ చేస్తూవున్నారు. ఇక్కడ వున్నది అన్వేషకుడు మాత్రమే!! మానవజాతి మొత్తానికి పట్టిన గందరగోళాన్ని తొలగించిన అద్వితీయ ఘట్టం ఈరోజు!!

మనందరం పూజ్యశ్రీ మాస్టరుగారిలో గుర్తించవలసిన విషయం ఏమిటంటే, ఆయనలో 'ఒక మూల' బాబాను యిరికించలేదు, బాబాలో ఈ మొత్తాన్ని చూసారు.

"విశ్వమంతా ఏ మహత్తర చైతన్యంలో సంకల్ప మాత్రంగా ఉన్నదో" అన్న దానికి వివరణ 'ఏది నిజం' గ్రంథంలోనూ,,,, ఆ మహత్తర చైతన్యంలో ఆయన కూడా ఒక భాగంగా ఉన్నారనిపించడానికి వివరణ 'శ్రీ సాయి లీలామృతగ్రంథం' లోను వున్నదని చెప్పొచ్చు.

అందరిలోనూ అంతటా ఒక్కటే వున్నదని సాధన చేయడమే ఆధ్యాత్మికత! తక్కినది ఏదీ ఆధ్యాత్మికత కాదు.. పూజ్యశ్రీ మాస్టరుగారి భక్తబృందంగా మన జీవిత విలువలని మార్చుకోవడానికి, ఆలోచనా విధానాన్ని మార్చుకోవడానికి ప్రయత్నించాలి. వ్యక్తి ప్రాధాన్యతలేని సార్వజనీనమైన సిద్ధాంతం ఆధ్యాత్మికత. కనుక, మీ అందరిలో వున్న భగవంతుడికి నమస్కరిస్తూ, వారికి తగిన బిడ్డలుగా మనల్ని తీర్చిదిద్దాలని ప్రార్థిస్తున్నాను" అంటూ వారి సత్సంగాన్ని ముగించారు.

తర్వాత, మహోత్సవానికి విచ్చేసిన భక్తులందరూ ఒక్కొక్కరుగా పూజ్యశ్రీ బాబా, పూజ్యశ్రీ మాస్టరుగారు, పూజ్యశ్రీ అమ్మగార్లకు నమస్కరించుకుని వారి ఆశీస్సులు అందుకున్నారు. తదుపరి మధ్యాహ్న భోజనం నివేదన చేయబడింది. వచ్చిన వారందరూ ఆ మహాప్రసాదాన్ని స్వీకరించారు. అంతటితో బ్రహ్మానుభూతి పర్వదిన మహోత్సవం ముగిసింది!! ●

# మాతృదేవి స్మృతులు

12వ పేజీ తరువాయి

అని మందలించారు. మళ్ళీ ఇప్పుడు మొదలుపెట్టి చేసుకుంటున్నాము.

ఈ విధంగా ప్రతిక్షణం మమ్మల్ని కాపాడుతూ, సూచనలిస్తూ, మావెంటే వుంటున్న బాబా, పూజ్యశ్రీ మాస్టరుగారు, పూజ్యశ్రీ అమ్మగార్లకు ఏమిచ్చినా ఋణం తీరదు. ఇప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు నాపై కురిపించే ప్రేమ చూస్తే, "నా సమాధినుంచి కూడా నేను నా కర్తవ్యం నిర్వహిస్తాను" అన్న బాబా వాక్యాలు పూజ్యశ్రీ అమ్మగారి విషయంలో కూడా నిత్యసత్యం అనిపిస్తుంది. నా దృష్టిలో బాబాకు, పూజ్యశ్రీ అమ్మగారికి భేదం లేదు. నేను ఎప్పుడూ పూజ్యశ్రీ అమ్మగారిని ప్రత్యక్షంగా చూడకపోయినా నాకు ఇటువంటి అనుగ్రహం లభించడం వారి అపారకరుణకు నిదర్శనం.

వారి అనుగ్రహాన్ని మేము జన్మజన్మలకూ పొందగలగాలని పూజ్యశ్రీ అమ్మగారి పాదాలనంటి ప్రార్థిస్తూ శతసహస్రకోటి వందనాలు తెలియచేసుకుంటున్నాను.

ఓం సంతానప్రదాయై నమః!

# ద్వారకామాయి అనుభవమండపము

శ్రీమతి నాగమణి, ఏలూరు

నేను డిగ్రీ వరకు చదువుకున్నాను. అంతవరకు మా కుటుంబ పరిస్థితులు బాగానే వుండేవి. తర్వాత కొన్ని సమస్యలు రావడంతో ఆర్థికంగా బాగా నష్టపోయాం. నాకు చిన్నప్పటినుంచి బాబా అంటే ఇష్టం వున్నా, నా చదువు పూర్తయిన తర్వాత మాత్రమే ఎక్కువగా బాబా గుడికి వెళ్లడం, సేవ చేసుకోవడం జరిగాయి. మా ఇంటి పరిస్థితులు ఎలా వున్నా నేను మాత్రం బాబా సేవ వదిలేదాన్ని కాదు. నాకు బాబా సచ్చరిత్ర చదవాలని చాలా ఆసక్తిగా వుండేది. కానీ ఆ గ్రంథం కొనుక్కోవడానికి డబ్బులు లేవు. ఒకసారి ఒకరిని అడిగి ఆ గ్రంథం తెచ్చుకుని తెల్లకాగితాల పుస్తకంలో రాయడం మొదలుపెట్టాను. సగం అయ్యేసరికి వాళ్లు గ్రంథం కావాలని అడగడంతో ఇచ్చేయాల్సి వచ్చింది. ఒకరోజు బాబా దగ్గర కళ్లనీళ్లపర్యంతం అయ్యాను. బాబా నీ చరిత్ర చదివే అదృష్టం లేదు అని! అప్పుడు విచిత్రంగా, మాకు తెలిసిన ఒక ఆవిడ శిరిడీ వెళ్లి సచ్చరిత్ర గ్రంథం తీసుకొచ్చి నాకు యిచ్చి చదువుకోమని చెప్పారు. నాకు ఎంతో ఆనందం వేసింది. తర్వాత ఏలూరులో వున్న కొంతమంది గురుబంధువులతో నాకు పరిచయం ఏర్పడింది. వాళ్లు పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారి సత్సంగాలు చేసుకుంటారు. వాళ్లతో పరిచయం అయిన తర్వాత వాళ్ళు నాకు పూజ్యశ్రీ మాస్టరుగారు రచించిన గ్రంథాలన్నీ బహుమతిగా యిచ్చారు. అప్పటినుంచి నేను శ్రీ సాయి లీలామృతం గ్రంథం పారాయణ చేయడం మొదలు



పెట్టాను.

2012లో హైదరాబాదులో మా అన్నయ్య వుండేవాడు. కానీ అతనికి అప్పుడు ఉద్యోగం లేదు. నా దగ్గర వున్న కొన్ని డబ్బులు తీసుకొని హైదరాబాద్ వచ్చి ఒకరోజు నాగోలు పూజ్యశ్రీ అమ్మగారి దర్శనం కోసం వచ్చాను. అప్పుడు అమ్మగారి దర్శనం లేదు. కాసేపు సత్సంగహాల్లో

కూర్చుని నమస్కారం చేసుకొని వెళ్ళిపోయాను. అప్పుడు మాకు తినడానికి కూడా ఇబ్బందికరమైన పరిస్థితి. తిరుగు ప్రయాణానికి మా దగ్గర డబ్బులు లేవు. కానీ నేను ఏలూరు వచ్చి తీరాలి. అప్పుడు ధైర్యం చేసి జనరల్ కంపార్ట్మెంట్ లో రాజమండ్రి వెళ్లే రైలు ఎక్కాను. ఫైబెర్త్ ఎక్కి కూర్చుని, టిసి వస్తే విషయం చెబుదాంలే అన్నట్టు, సాయిలీలామృతము గ్రంథం చదువుకుంటూ కూర్చున్నాను. అక్కడ కింద కొంతమంది కూర్చుని వున్నారు. వాళ్ళు నన్ను పలకరించి ఏం చదువుతున్నావని అడిగారు. ఈ గ్రంథం గురించి చెప్పాను. వాళ్లు బాబా లీలలు చెప్పమంటే ఆ గ్రంథంలో కొన్ని లీలలు చెప్పాను. చాలా చక్కటి సత్సంగం జరిగింది. కాస్సేపటికి నాకు విపరీతంగా ఆకలేసింది. అప్పటికి నేను సరిగ్గా భోంచేసి కొన్ని రోజులు అయింది. కింద సీట్ లో కూర్చున్నవాళ్ళు, వాళ్లు తెచ్చుకున్న ఆహారం నాకు కూడా పెట్టి, తినాల్సిందేనని బలవంతం చేశారు. అప్పుడు బాబా అనుగ్రహానికి నాకు కళ్ళనీళ్లు వచ్చాయి. మర్నాడు నేను క్షేమంగా రాజమండ్రిలో దిగాను. ఆరోజు, టి సి మా బోగీకి రాలేదు. అయితే ఇది కావాలని చేసిన పని కాదు, విధి లేని పరిస్థితిలో జరిగింది.

నాకు హారతులు పాడడం చాలా ఇష్టం. కానీ, అప్పుడు హారతి పుస్తకం కొనుక్కోవడానికి పది రూపాయలు కూడా లేవు. అందువల్ల బాబాగుడికి వచ్చినప్పుడు, హారతులన్నీ పుస్తకంలో రాసుకుని పాడుకునేదాన్ని. చిత్రంగా ఈ రోజు బాబా నాకు ఎన్నో హారతి పుస్తకాలు, 5 అవతారాల విగ్రహాలు - ఇవన్నీ కూడా చక్కగా సత్సంగం చేసుకునే వాళ్ళ ఇంటికి యిచ్చే స్తోమత ప్రసాదించారు. మా ఇంట్లో నేను సత్సంగం చేసుకోలేకపోతున్నాను కనుక నేను ఇచ్చిన విగ్రహాలు పెట్టుకొని చాలామంది సత్సంగం చేసుకోవాలని నా కోరిక. ఇప్పుడు ఆలోచిస్తే బాబా కృప నా మీద ఎంతగా ఉందో అని చాలా ఆనందంగా వుంటుంది.

నాకు 28 సంవత్సరాలు వచ్చినా, ఆర్థిక పరిస్థితి కారణంగా పెళ్లి కుదరలేదు. కానీ నేను అదేం పట్టించుకోకుండా బాబా సేవ చేసుకుంటూవుండేదాన్ని. ఏలూరు పక్కనే పెదపాడు అనే గ్రామం నుంచి సంబంధం వచ్చింది. వాళ్ళు పెళ్లి చూపులకి వచ్చి వెంటనే ఒప్పుకుని వివాహం నిర్ణయించుకున్నారు. చాలా మంచి సంబంధం. మావారు చాలా మంచివారు. మా పరిస్థితి అంతా తెలుసుకొని ఒక రకంగా ఎదురు పెట్టి పెళ్లి చేసుకున్నారనే చెప్పాలి. నన్ను, మా కుటుంబ సభ్యుల్ని కూడా చాలా బాగా చూసుకుంటారు. కానీ ఒక్క విషయంలో మాత్రం మా ఇద్దరికీ కొద్దిగా భేదాభిప్రాయం, అదేంటంటే బాబాని పూజించడం ఆయనకి అంత ఇష్టం ఉండదు. పైగా సత్సంగాలకి పంపించడం కానీ గుళ్ళకు తీసుకెళ్లడం కానీ చేసేవారుకాదు. పెళ్లి అయితే శిరిడీ వస్తానని మొక్కుకున్నానని చెప్పిన కారణంగా పెళ్ళైన కొత్తల్లో శిరిడీ తీసుకెళ్లారు. అప్పుడు నేను వారిని, చిన్న బాబా విగ్రహం కొనమని అడిగాను. ఇప్పుడే కాదు ఇంకెప్పుడూ అడక్కు నేను కొననని చెప్పారు. కానీ మాకు ఒక అమ్మాయి, అబ్బాయి పుట్టిన తర్వాత శిరిడీకి తీసుకెళ్లి, వారే నాకు ఒక పెద్ద బాబా విగ్రహాన్ని కొనిచ్చి "నీ ఇష్టం వచ్చినట్టు పూజించుకో!" అని చెప్పారు. ముందు నాకు పాప పుట్టింది. ఆ పాపకి ఇప్పుడు పది సంవత్సరాలు. తర్వాత బాబు. బాబు పుట్టినప్పటినుంచి ఆయనకి కూడా బాబా మీద నమ్మకం ఏర్పడి అప్పటి నుంచి నన్ను హారతులు చేసుకోవడానికి పారాయణ చేసుకోవడానికి ఒప్పుకుంటున్నారు.

మొదటిసారి గర్భవతిగా వున్నప్పుడు బాబాగారు నాకు అమ్మాయి బొమ్మ చూపించారు. నాకు ఆడపిల్ల పుడుతుందని అర్థమైంది. అదేవిధంగా పాప పుట్టింది. తనక్కూడా బాబా అంటే బాబా గుడికి వెళ్లడం అంటే సేవ చేయడం అంటే చాలా చాలా ఇష్టం. ఎంతో సంతోషంగా బాబా కి సేవలు చేసుకుంటూ వుంటుంది. తనకి నడవడం వచ్చినప్పటి నించి, బాబా గుళ్లో పల్లకి సేవలో పల్లకితో పాటు, గుడిచుట్టూ ప్రదక్షిణ చేసేది. ఏరోజూ కాళ్ళు నొప్పని అనలేదు. తనకి ఒకటిన్నర సంవత్సరం అప్పుడు బ్లేడ్ మింగేసింది. దాని చుట్టూ పల్చటి తెల్లకాగితం చుట్టబడి వుంటుంది కదా. దానితో పాటే మింగేసింది. బహుశా ముందు రోజు మింగి వుంటుంది. మరునాడు ఉదయం మోషన్ కి వెళ్ళడానికి పాప బాగా ఇబ్బంది పడుతోంది. ఏంటి ఇంత ఇబ్బంది పడుతోందని చూస్తే కాసేపటికి మోషన్ నుంచి బ్లేడ్ బయటకు వచ్చింది. నేను పెద్దగా కేకలు పెట్టి ఏడ్చేశాను. చిన్న పాప కదా, మోషన్ అయ్యేటప్పుడు కానీ, లోపల వున్నప్పుడు కానీ నరాలన్నీ తెగిపోయి వుండాలి. కానీ అలా ఏమీ జరగలేదు. బాబా మాపాపని ఎంతపెద్ద ప్రమాదం

*మిగతా 29వ పేజీలో*

# ఆచార్యుని అద్భుత లీలలు

*శ్రీ పడాల నారాయణమూర్తి*

పూజ్యశ్రీ భరద్వాజ మహారాజ్ లీలావైభవాన్ని ఒంగోలుకి చెందిన శ్రీ పడాల నారాయణమూర్తిగారు ఈవిధంగా తెలియచేస్తున్నారు...

1986 సంవత్సరంలో డిగ్రీ పూర్తిచేసిన కొత్తలో నాకు పూజ్యశ్రీ మాస్టరుగారితో పరిచయమైంది. నాకప్పుడు 20 సంవత్సరాలు. మా ఇంట్లో అందరూ శ్రీ ఎక్కిరాల కృష్ణమాచార్యులుగారిని అనుసరించేవారు. మా నాన్నగారు ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారు రచించిన శ్రీసాయిలీలామృతం గ్రంథాన్ని కొన్నారు. నేను ఆ గ్రంథాన్ని మంచం మీద పడుకుని చదువుతున్నాను. కొంత చదివాక, 'ఇంత మంచి గ్రంథాన్ని అలా పడుకుని చదవడమేమిట'ని ఏదో తప్పు చేస్తున్న భావన వచ్చి, వెంటనే లేచి కుర్చీలో కూర్చుని చదవడం మొదలుపెట్టాను. పది రోజులలో పూర్తి చేశాను. 'ఇంత అద్భుతమైన గ్రంథాన్ని వ్రాసినవారు మన ఊరిలోనే వుంటే వెళ్లి చూడకపోవడమేమిట'ని, వారు ఎక్కడ వుంటారో విచారణ చేసి, సంతపేటలో వుంటున్నారని తెలిసి ఒకరోజు వెళ్లాను.

నేను వెళ్లేసరికి వారు ఒక్కరే కూర్చుని వున్నారు. నేను గుమ్మం బయట నిలబడి, 'ఇంత గొప్ప గ్రంథం వ్రాసిన ఆయన ఈయనేనా?' అని సంభ్రమాశ్చర్యాలతో వారిని చూస్తున్నాను. వారూ నన్ను చూస్తున్నారు. కానీ నేను లోపలకు వెళ్ళలేదు. వారు కూడా నన్ను లోపలకు రమ్మని పిలవలేదు. వారికి నమస్కరిద్దామని కానీ, లోపలకు వెళదామని కానీ అనిపించలేదు. నేను ఒక ఐదు నిముషాలు అక్కడే నిల్చుని వెనక్కి వెళ్ళిపోయాను.

నాకు ప్రతిరోజూ బాబా మందిరానికి వెళ్లే అలవాటుండేది. ఇప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి మందిరం వున్నచోట ఖాళీ ప్రదేశం వుండేది. అక్కడ నేను, నా స్నేహితుడు నాగేశ్వరరావు రాత్రి తొమ్మిది గంటలదాకా కూర్చుని మాట్లాడుకునేవారము. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఉద్యోగం దొరకడంలేదని నాకు ఎంతో ఆందోళనగా వుండేది.

ఒకరోజు పూజ్యశ్రీ మాస్టరుగారి దర్శనానికి వెళ్లాలనిపించి వెళ్లాను. అప్పుడు తిన్నగా లోపలకు వెళ్లి ఆయనకు నమస్కరించుకున్నాను. వారు నా నుదుటన బొట్టు పెట్టారు. అప్పుడు, "మాస్టరుగారూ, నాకు ఉద్యోగం రావడం లేదు. మానసికంగా చాలా ఆందోళనగా వుంది" అన్నాను. "అలాగా! ఏం ఫరవాలేదు. బాబా నీకు మంచి ఉద్యోగం ఇస్తారులే!" అన్నారు. ఒక పదిహేను నిమిషాలయ్యాక, "మాస్టరుగారూ, నేను వెళ్లి వస్తాను" అన్నాను. "కాసేపు కూర్చో!" అన్నారు. అంతటివారు కూర్చోమంటే వెళ్లిపోవడమేమిటని కూర్చున్నాను. కాసేపటిలో ఒక భక్తుడు వచ్చి పూజ్యశ్రీ మాస్టరుగారికి నమస్కారం చేసుకుని, శిరిడీనుంచి ప్రసాదం తీసుకువచ్చానని చెప్పి ఆయనకు యిచ్చాడు. పూజ్యశ్రీ మాస్టరుగారు ఆ ప్రసాదాన్ని నాకు యిచ్చారు. అదే మొదటిసారి నేను శిరిడీ ప్రసాదం తీసుకోవడం. పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పినట్లే నాకు రెండు, మూడు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వంలో మంచి ఉద్యోగం వచ్చింది.

నాకు ఉద్యోగం వచ్చిన కొన్నిరోజులకు విజయదశమి పండగ వచ్చింది. నేను అప్పటివరకు శిరిడీ చూడలేదు. నాకెందుకో విజయదశమికి శిరిడీ వెళ్ళాలనిపించి పూజ్యశ్రీ మాస్టరుగారితో చెప్పాను. వెంటనే ఆయన, "చాలా రద్దీగా వుంటుందే, ఆ రోజు వెళతావా?" అని, "ఇదివరకు చూశావా?" అనడిగారు. "లేదండి, ఇదే మొదటిసారి!" అన్నాను. "సరేలే వెళ్ళు. బాబానే చూసుకుంటారు" అన్నారు! వారు అలా ఎందుకు అన్నారో అప్పుడు అర్థం కాలేదు.

నేను శిరిడీ యాత్రకు బయలుదేరాను. నాకు శిరిడీ గురించి ఏమాత్రం అవగాహన లేదు. రైలులో ఔరంగాబాద్ స్టేషన్ దగ్గర ఒక అబ్బాయి కలిశాడు. అతను ఢిల్లీనుంచి వస్తున్నాడు. ఆ అబ్బాయికి తెలుగు వచ్చు. అతను కూడా మొదటిసారే శిరిడీ వెళుతున్నాడు. ఇద్దరం కలిసి శిరిడీలో అడుగు పెట్టేసరికి చాలా రద్దీగా వుంది. అతనే రూమ్ వెతికాడు. అంత రద్దీలోనూ రూమ్ దొరికింది. దర్శనం కూడా బాగా జరిగింది. మర్నాడు సాయంత్రం ఆ అబ్బాయి టాక్సీ మాట్లాడి నన్ను మన్మాడ్ స్టేషన్లో దింపి, తాను ఢిల్లీ వెళ్లే రైలు కోసం వెళ్ళాడు. నాకు రిజర్వేషన్ లేదు. అయినా రైలు ఎక్కగానే సీటుపైన సామాను పెట్టుకునే చోటు ఖాళీగా వుంటే అక్కడ ఎక్కి పడుకున్నాను. తిరిగి సికింద్రాబాద్ వచ్చేవరకు నన్నెవరూ నిద్ర లేపలేదు! అక్కడ దిగాక మా బంధువుల ఇంటికి వెళ్లి, తిరిగి అదే రోజు సాయంత్రం ఒంగోలు రైలు ఎక్కడానికి స్టేషనుకి వచ్చాను. అప్పుడు కూడా నాకు రిజర్వేషన్ లేదు. నేను TC ని కలిసి పరిస్థితి చెప్పాను. "ఫలానా బోగీలో కూర్చోండి. నేను వచ్చి మాట్లాడతాను" అన్నాడు. నేను వెళ్లి బెర్త్ ఎక్కి పడుకున్నాను. ఒంగోలులో దిగేవరకు TC రానేలేదు! నన్ను ఎవ్వరూ లేపనేలేదు. ఊహించలేనంత సౌకర్యంగా నా శిరిడీ యాత్ర జరిగింది! ఆరోజు పూజ్యశ్రీ మాస్టరుగారు అలా ఎందుకు అన్నారో అప్పుడు అర్థమైంది.

ఆయన ఆశీస్సులవల్లనే నా యాత్ర చక్కగా జరిగిందని నాకు తెలుసు. కానీ ఆయన ఆ విషయం ఒప్పుకోరు. అంతా బాబా దయ అంటారు. అది పూజ్యశ్రీ మాస్టరుగారి గొప్పతనం.

1989వ సంవత్సరంలో ఉగాదికి ఒంగోలు వెళ్లాను. నేను వెళ్ళేటప్పుడు కర్నూలులో కొందరు భక్తులు తాము పూజ్యశ్రీ మాస్టరుగారి దర్శనానికి రావాలనుకుంటున్నామని, ఆయనను ఎప్పుడు కలవవచ్చో తెలుసుకోమన్నారు. యథాప్రకారం ఉగాదిరోజు సాయంత్రం నేను పూజ్యశ్రీ మాస్టరుగారి ఇంటికి వెళ్లాను. ఆరోజు ఆయన రూపం మనోహరంగా వుంది. పట్టుపంచె, షర్ట్, పట్టు కండువా వేసుకుని సత్సంగానికి వెళుతున్నారు. నేను వారికి నమస్కారం చేసుకుని, మా కర్నూలు సత్సంగసభ్యులు అడిగిన విషయాన్ని విన్నవించాను. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు, "ఏప్రిల్ 12 లోపల రమ్మను. తరవాత నేనుండను" అన్నారు! ఆ తరువాత వారేదో ఊరికి వెళతారేమోనని అనుకున్నాను. సరేనని తిరిగి వచ్చేస్తుంటే, "మూర్తీ! లోపలకి వెళ్లి బాబా దగ్గర తీర్థం తీసుకో! అక్కడ రెండు అరటిపళ్ళు వుంటాయి. ఒకటి నువ్వు తీసుకో. రేపు నువ్వు గొలగమూడి వెళతానన్నావు కదా! ఇంకొక అరటిపండు అక్కడ సుబ్బరామయ్యకి ఇవ్వు" అంటూ, "ఒక కొబ్బరికాయ తీసుకుని బాబా గుడికి వెళ్లి, ధునిలో వేసి ఇంటికి పో!" అన్నారు. అదే వారి చివరి దర్శనమని అప్పుడు నాకు తెలియదు.

ఏప్రిల్ 13వ తేదీ సాయంత్రం కర్నూలులో సాయిబాబా గుడికి వెళ్లాను. అక్కడి పూజారి గారు నన్ను చూస్తూనే, "ఏంటి మూర్తిగారూ, మీరింకా ఇక్కడే వున్నారు! ఒంగోలు వెళ్లలేదా?" అన్నారు. "పదిరోజుల క్రితమే కదండీ వెళ్లాను?!" అన్నాను. "అది సరేనండీ, నిన్న పూజ్యశ్రీ మాస్టరుగారు సిద్ధిపొందారు కదా! అందుకని అడిగాను" అన్నారు. నేను ఆయనతో ఎవరి గురించి విన్నారోనని బాగా వాదించాను. వారు వివరించి చెప్పాక వెంటనే ఒంగోలు బయలుదేరాను. బస్సు చాలా రద్దీగా వుంది. బస్సుపైన కూడా జనాలు ఎక్కి కూర్చున్నారు. నా అలవాటు ప్రకారం, "మాస్టరుగారూ, ఈ రద్దీలో నేను ప్రయాణం చేయలేను. నాకు ఎలాగైనా మీరు సీట్ ఇప్పించండి" అని ప్రార్థించాను. బస్సులోకి నేను ఎక్కేసరికి కొంతమంది భోజనానికి దిగారు. నాకు ఒక మూల సీట్ కనిపించింది. నేను వెళ్లి అక్కడ కూర్చున్నాను. ఒంగోలు వచ్చేవరకు నన్నెవ్వరూ లేపలేదు! కానీ తరవాత అనిపించింది.. 'ఈ సందర్భంలో కూడా

ఎంత మూర్ఖంగా సీట్ ఇప్పించమని కోరాను' అని! నేను ఒంగోలులో బాబా గుడికి వెళ్లేసరికి పూజ్యశ్రీ మాస్టరుగారిని సమాధి చేసేశారు. నేను అక్కడే కూర్చుని చాలాసేపు బాధపడ్డాను.

పూజ్యశ్రీ మాస్టరుగారు నిత్యసత్యులు. నేను తిరిగి ఒంగోలునుంచి కర్నూలుకి వచ్చాక, "మాస్టరుగారూ! మీ దర్శనం నాకు ఇంకెప్పటికీ కాదు. మీరు ఇంకెప్పటికీ కనిపించరు కదా?!" అని చాలా బాధపడ్డాను. అదేరోజు రాత్రి పూజ్యశ్రీ మాస్టరుగారు స్వప్నదర్శనమిచ్చారు. గళ్ళలుంగీ, బనీనుతో వున్నారు. తలంటు పోసుకుని ఎంతో చక్కగా వున్నారు. వెంటనే నేను వారి పాదాల మీదపడి గట్టిగా వారిని చుట్టుకుని ఏడుస్తున్నాను. అప్పుడు వారు నా వీపుమీద చరిచి, "ఎందుకురా ఏడుస్తున్నావ్?" అన్నారు. "ఏం తొందరొచ్చిందని మాస్టరుగారూ, బాబా దగ్గరికి వెళ్లిపోయారు? నాకు ఏమీ తెలియదు. ఏ విషయమైనా మీతో చెప్పుకునేవాడ్ని. ఇప్పుడు ఎవరితో చెప్పుకోవాలి?" అనంటే, "ఓరి,ఓరి,ఓరి!! నువ్వు పిలిస్తే నేను పలకనా? కావాలంటే పిలిచి చూడు!" అన్నారు.

వారు చెప్పిన విధంగానే చాలా సందర్భాలలో తలచుకున్న వెంటనే నన్ను అనుగ్రహించేవారు. నేను ఒంగోలు వచ్చినప్పుడల్లా పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి ఎదురుగా చాలాసేపు కూర్చునేవాడిని. అప్పట్లో నాకు బాగా కళ్ళు తిరుగుతున్నట్లు వుండేవి. నేను పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి మీద తలపెట్టి, కళ్ళు మూసుకుని నా బాధని చెప్పుకున్నాను. వెంటనే పూజ్యశ్రీ మాస్టరుగారి గొంతు వినిపించింది.. "Why don't you take Kali Phos 6x? " అని! నేను ఒక్కసారి అదిరిపోయాను!! పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పినట్లు ఆ హోమియోపతి మందు వాడితే కళ్ళు తిరగడం తగ్గిపోయింది!

నాంపల్లి బాబా, రామిరెడ్డితాతగారు మొదలైన ఎందరో మహాత్ములను సశరీరంగా వున్నప్పుడే దర్శనం చేసుకున్నాను. శిరిడీలో శివనేశన్ స్వామిని దర్శించుకున్నాను. ఇంకెందరో సత్పురుషులను దర్శించగలిగాను. కొంతమంది మహాత్ముల సమాధి దర్శనం కూడా చేసుకున్నాను. ఇదంతా పూజ్యశ్రీ మాస్టరుగారి ఆశీస్సుల వల్లే జరిగింది. అలా అన్ని విషయాల్లో నన్ను అనుక్షణం అనుగ్రహిస్తూ, కాపాడుతూ వున్నారు.

అంతటి గొప్పవారు నాకు పరిచయం కావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఒంగోలులోనే సాక్షాత్తు దత్తస్వరూపం నడయాడుతూ వుంటే ఎంతోమంది దర్శించుకోలేకపోయారు. కానీ నేను దర్శించుకోవడం నాకు వారు స్వయంగా ప్రసాదించిన భిక్షగా భావిస్తూ కృతజ్ఞతతో అనంతకోటి ప్రణామాలర్పిస్తున్నాను. ●

## ద్వారకామాయి అనుభవ మంటపము

26వ పేజీ తరువాయి

నించి కాపాడారో తలచుకుంటే ఇప్పటికీ ఒళ్ళు గగుర్పొడుస్తుంది.

మా అత్తగారి ఇంట్లో అందరికీ వెంకటేశ్వర స్వామి అంటే చాలా ఇష్టం. నాకు ఎందుకో తెలియదు కానీ మొదటి నుంచి దత్త స్వరూపాలు, మహాత్ములు, వాళ్ళ నామాలు, దర్శనాలు అవే నాకు చాలా ఇష్టంగా ఉంటాయి. పెళ్లయిన తర్వాత వాళ్ళందరూ వెంకటేశ్వర స్వామిని కొలుస్తున్నా, నేను మాత్రం మనసులో బాబాని తలుచుకుంటూ వుండేదాన్ని. ఒకసారి మా కుటుంబ సభ్యులందరము చిన్నతిరుపతి వెళ్ళాము. దర్శనం కోసం వరుసలో వున్నప్పుడు, నా వెనకాల మా అత్తగారు నిలుచున్నారు. ఒక పెద్దాయన వచ్చి అందరికీ గోవింద నామాలు అచ్చువేసిన కాగితాలు పంచుతున్నారు. సరిగ్గా నా దగ్గరికి వచ్చాక ఆయన నావైపు చూసి, "నీకు ఇవ్వాల్సింది ఇది కాదులే" అని బాబా అష్టోత్తరం వున్న కాగితం నా చేతిలో పెట్టి వెళ్ళిపోయారు. అది చూసి మా అత్తగారు చాలా ఆశ్చర్య పోయారు. నా ఆనందానికి అవధులులేవు.

ఇలా చాలా చాలా అనుభవాలు ప్రసాదించడమే కాదు, ప్రతిక్షణం నాతో వుండి నన్ను నడిపిస్తున్న సమర్థ సద్గురు సాయినాథునికి శతకోటి కృతజ్ఞతా పూర్వక వందనములు తెలియజేసుకుంటున్నాను.●

# పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

**SRI GURUPADUKA PUBLICATIONS, C/o. SRI MANGA BHARADWAJA TRUST**
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole,Hyderabad - 500068, Phone: +91 7416041550
Branch Office : Kondalah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh. Phone: 8597233271
*Send DD in favour of 'Sri Manga Bharadwaja Trust (Publications)' Payable at Hyderabad or Ongole*

### శ్రీ గురుని పై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ గురు చరిత్ర – శ్రీ సాయి లీలామృతము (బౌండ్) | ₹499.00 |
| శ్రీ గురు చరిత్ర | ₹199.00 |
| శ్రీ సంహితాయన గురు ద్విసాహస్రి | ₹149.00 |
| శ్రీ దత్తావతార మహాత్మ్యము | ₹75.00 |

### శ్రీ శిరిడీ సాయిబాబాపై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతము | ₹199.00 |
| శ్రీ సాయి సన్నిధి | ₹199.00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము. | ₹119.00 |
| శ్రీ సాయినాథ పూజ | ₹49.00 |
| శిరిడీ హారతులు | ₹15.00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | ₹49.00 |
| శ్రీ సాయినాథ స్తవన మంజరి | ₹10.00 |
| సాయిని పూజించడం ఎందుకు? | ₹10.00 |
| సత్సంగము – భజన | ₹10.00 |
| సాయి సూక్తి – ఆచార్యవాణి | ₹20.00 |
| శ్రీ సాయి నిత్య సత్య వ్రతము<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹20.00 |

### ఇతర మహాత్ముల గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ  స్వామి సమర్థ | ₹75.00 |
| శ్రీ తాజుద్దీన్ బాబా | ₹75.00 |
| అవధూత శ్రీ వెంకయ్య స్వామి | ₹99.00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | ₹75.00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | ₹75.00 |
| శ్రీ ఆనందమయి అమ్మ | ₹75.00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | ₹99.00 |
| శ్రీ గురు సిద్ధారూఢ స్వామి<br>(రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |
| అవధూత శ్రీ చివటం అమ్మ<br>(రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |

### అన్వేషణాత్మకమైన వైజ్ఞానిక గ్రంథములు

| | |
|---|---|
| ఏది నిజం? | ₹49.00 |
| మతం ఎందుకు? | ₹49.00 |
| విజ్ఞాన వీచికలు | ₹99.00 |
| పరిప్రశ్న | ₹119.00 |

### ధ్యాన సంబంధమైన గ్రంథములు

| | |
|---|---|
| ధ్యానయోగ సర్వస్వము | ₹99.00 |
| బుద్ధ ధ్యాన హృదయము | ₹49.00 |

### ఆధ్యాత్మికత - తత్వచింతనా పూర్వక గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | ₹199.00 |
| ఆధ్యాత్మిక జాగృతి<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹199.00 |

### ఇతర గ్రంథములు

| | |
|---|---|
| పురుషసూక్త రహస్యము | ₹49.00 |
| మనము – మన సంస్కృతి | ₹75.00 |

### పూజ్య భరద్వాజ గురుదేవులపై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు<br>(రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹149.00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ<br>(రచన : శ్రీమతి శ్రీదేవి) | ₹299.00 |
| మహా పురుషుడు<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹60.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –1<br>(సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –2<br>(సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| ఆచార్య అమృత లేఖావళి<br>(సంకలనం : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹199.00 |
| మరో నంద దీపం | ₹120.00 |
| మాస్టారు అమృత వాక్కులు<br>(రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹99.00 |

### బాలల కొరకు విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| బాలల సాయి లీలామృతము<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹49.00 |
| బాలల సాయిసన్నిధి<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |
| బాలల శ్రీ గురు చరిత్ర<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |

### BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba The Master | ₹249.00 |
| Shri Guru Charitra | ₹149.00 |
| Supreme Master | ₹149.00 |
| Tajuddin Baba | ₹149.00 |
| Sai Baba and His Teachings | ₹149.00 |
| Children's Sai Baba The Master<br>*(Author: Smt. Adidam Vedavati)* | ₹80.00 |

### BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sri Sai Baba (Hindi) | ₹249.00 |
| Sri Guru Charitra (Hindi) | ₹249.00 |
| Sri Sai Leelamruthamu (Kannada) | ₹249.00 |
| Sri Sainatha Prabodhamruthamu (Kannada) | ₹149.00 |
| Sri Guru Charitra (Kannada) | ₹199.00 |
| Sri Sai Sannidhi (Kannada) | ₹249.00 |
| Tibet Yogi Milarepa Charitra (Kannada) | ₹119.00 |
| Sri Swami Samartha (Kannada) | ₹119.00 |
| Sri Sai Leelamruthamu (Tamil) | ₹249.00 |
| Sri Guru Charitra (Tamil) | ₹299.00 |
| Sri Shirdi Sai Aartulu (Tamil) | ₹29.00 |
| Sri Sainatha Stavana Manjari (Tamil) | ₹20.00 |
| Sri Sai Leelamruthamu (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Odiya) | ₹299.00 |
| Sri Sai Sannidhi (Odiya) | ₹249.00 |

## మార్చి 6, 2024 బుధవారం

### ఉదయ కార్యక్రమములు

గం॥ 5:30 - పూజ్యశ్రీ మాస్టరుగారికి మరియు పూజ్యశ్రీ అమ్మగారికి మేలుకొలుపు సేవ,
గం॥ 6:00 - శ్రీ సాయిబాబా కాకడ ఆరతి
గం॥ 7:30 - పూజ్యశ్రీ అమ్మగారి సమాధి అభిషేకము, ప్రత్యేక అలంకరణ.
గం॥ 8:30 - అల్పాహార నైవేద్య సేవ.
గం॥ 9:00 - ప్రసాద వితరణ.
గం॥ 9:30 - శ్రీ సాయినాథుని సన్నిధిలో, మహాత్ముల సమక్షంలో, వేద మంత్రాలతో,
పూజ్య గురు దంపతుల లీలా కల్యాణ మహోత్సవ వైభవము.
మ॥ గం॥ 2:00 - భోజన ప్రసాద వితరణ

### సాయంకాల కార్యక్రమములు

గం॥ 6:30 - 'శ్రీ నళినీప్రియ కూచిపూడి నృత్య నికేతన్', ఒంగోలు వారిచే 'శ్రీ శిరిడీ సాయి దివ్య చరితం'
నృత్య రూపకం ప్రదర్శన.
గం॥ 9:00 - శేజ్ హారతి.
గం॥ 9:30 - ప్రసాద వితరణ.

## మార్చి 7, 2024 గురువారం

గం॥ 5:30 - పూజ్యశ్రీ మాస్టరుగారికి మరియు, పూజ్యశ్రీ అమ్మగారికి మేలుకొలుపు సేవ
గం॥ 6:00 - శ్రీ సాయిబాబా కాకడ ఆరతి.
గం॥ 7:30 - పూజ్యశ్రీ అమ్మగారి సమాధి అభిషేకము, ప్రత్యేక అలంకరణ.
గం॥ 8:30 - అల్పాహార నైవేద్య సేవ.
గం॥ 9:00 - ప్రసాద వితరణ.
గం॥ 9:30 - గురు పుత్రులు శ్రీ ఎక్కిరాల ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ గారిచే సత్సంగము
మ॥ గం॥ 1:00 - కార్యక్రమముల ముగింపు,
భోజన ప్రసాద వితరణ.

*కళ్యాణ మహోత్సవమునకు విచ్చేయు భక్తులకు వసతి, భోజన సదుపాయాలు ఏర్పాటు చేయబడినవి.*
*వివరములకు :- శ్రీ ఆర్.ఎస్. శశిధర్ గారు (98496 45573).*

Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Edited, Printed and Published by Dr. R.S. Sasidhar, Ph.D. trustee of Sri Manga Bharadwaja Trust,
Ongole - 523002. Postal Registration Number : Prakasam/16/2024-2026, Regd.No. 37926/83.



# పూజ్య గురుదంపతుల లీలా కల్యాణ మహోత్సవము

పూజ్య గురుదేవులు శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారు, పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ తల్లి ల కళ్యాణ మహోత్సవం హిందూ కాలమానం ప్రకారం (మాఘ బహుళ నవమి) మార్చి 5వ తేదీన, ఆంగ్ల కాలమాన ప్రకారం మార్చి 6వ తేదీన వరుసగా రెండు రోజులు రావటం ఈ సంవత్సరం విశేషం. సమర్థ సద్గురు శ్రీ శిరిడీ సాయినాథుని ఆశీస్సులు మాత్రమే కాక, అవధూత శ్రీ చీరాల స్వామి, శ్రీ పాకలపాటి గురువుగారు మొదలైన ఎందరో మహాత్ముల యొక్క ఆశీస్సులతో జరిగిన వారి కళ్యాణం లోక కల్యాణానికే అనడంలో ఎంత మాత్రం అతిశయోక్తి లేదు. అటువంటి పుణ్య దినాన మనమందరం వారి జగత్ కల్యాణ లీలా మహోత్సవం జరుపుకుని, వారిని సేవించుకుని వారి అనుగ్రహాన్ని పొందుదాం! పూజ్య గురుదంపతుల శుభాశీస్సులు సమస్త మానవాళి పై ఎల్లవేళలా వుండాలని వారిని ప్రార్థిద్దాం!!

ఈ లీలా కళ్యాణ మహోత్సవము శ్రీ అలివేలు మంగమ్మ దివ్య సన్నిధానము, గుమ్మళంపాడు గ్రామం (సంతనూతలపాడు మండలం, ప్రకాశం జిల్లా, ఆం.ప్ర.) లో వైభవంగా జరుపుకుంటున్నాము. కార్యక్రమ వివరాలు లోపల యివ్వబడ్డాయి..

భక్తజనులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఇదే మా ఆహ్వానం!


IF UNDELIVERED, PLEASE RETURN TO: SRI MANGA BHARADWAJA TRUST, KONDAIAH BUNK STREET,
KOTHAPETA, ONGOLE, PRAKASAM DT., A.P. - 523002.